స్థాపితం : 1930 LONGEST LIVING NEWS PAPER IN TELUGU JOURNALISM Visit Internet Edition @ www.jaminryot.com

స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామనాయుడు జీవనప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి

జమీన్‌రైతు

సంపుటి : 77 సంచిక :48 1.12.2006 శుక్రవారం 12పేజీలు విడిప్రతి: రూ.3.00

డి.ఆర్. ఉత్తమలో విందుల పసందు

☆ బర్త్‌డే పార్టీలు, ఎంగేజ్‌మెంటు ఫంక్షన్లు, వివాహాలు తదితర శుభకార్యాలకు, కార్పొరేట్ మీటింగులు, సెమినార్లు, గెట్‌టుగెదర్లు మరియు కాన్ఫరెన్స్‌లకు అత్యాధునిక వసతులతో , అన్ని హంగులతో బేంక్వెట్ హాల్స్ (అన్ని రకముల ఎలక్ట్రానిక్ - సౌండ్, మ్యూజిక్, వీడియో పరికరములతో సహా)

☆ ప్రతి రోజూ వివిధ రకాల వెజ్&నాన్‌వెజ్ స్పెషల్ బఫే లంచ్ రూ.160/-లకే

మరెన్నో వసతులతో మీకు స్వాగతం పలికే

మీ డి.ఆర్. ఉత్తమ ☆ ☆ ☆ హోటల్

D.R. UTTHAMA HOTEL

23/976, Dhandayudha Puram, Nellore - 3. Phones : 2317777 - 10 Lines

కరీంనగర్, బొబ్బిలి... రెండింటిలో డేంజర్ సిగ్నల్స్

అక్కడ కరెంటు కాటు... ఇక్కడ కుటుంబ చేటు!

కోరి తెచ్చుకున్న కరీంనగర్ ఉప ఎన్నిక కాంగ్రెస్ గొంతులో పచ్చి వెలక్కాయ వలె మారుతున్నది. మింగలేక, కక్కాలేక ఉక్కిరిబిక్కిరి అయ్యే పరిస్థితి తెచ్చి పెడుతున్నది. ఎం.సత్యనారాయణరావు వాచాలత్వం వల్ల వచ్చి పడిన ఉపద్రవం ఇది. అయితే ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దాన్ని ఆహ్వానించారు. ఎన్నో రూపాల నిర్వీర్యం చేసిన టిఆర్ఎస్‌ను ఇక తిరిగి లేవకుండా చావగొట్టి, చెవులు మూయడానికి ఇదొక అవకాశమని భావించారాయన. తన పట్ల, తన అభివృద్ధి కార్యక్రమాల పట్ల, తాను అమలు చేసే ప్రజోపకార పథకాల వల్ల జనంలో వెల్లివిరుస్తున్న అభిమానం ఆసరాతో అతి సులువుగా కెసిఆర్‌ను ఓడగొట్టగలమని ఆశించారాయన. అదే జరిగితే ఇక ఈ జన్మలో ప్రత్యేక తెలంగాణా వాదన విన్పించదని కూడా భావించారు.


కానీ పోలింగ్ రోజు దగ్గర పడే కొద్దీ ఆయన ఊహలు, అంచనాలు తలక్రిందులౌతున్నాయని స్పష్టంగా అర్థమైపోతున్నది. టిఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య మాత్రమే కేంద్రీకృతమౌతుందనుకున్న పోటీలోకి అనూహితంగా తెలుగుదేశం పార్టీ దూసుక వస్తున్నది. పై చెయ్యి సాధిస్తున్నది. అది ముందు మిగిలే కొద్దీ కాంగ్రెస్ వెనుకబడి పోతున్నది. పరిస్థితి చెయ్యిజారి పోతున్నదని ప్రతి కాంగ్రెస్ వాదికీ అర్థమౌతున్నా, ఏమీ చేయలేక పోతున్నారు. ఏమి చేసినా ఉపయోగం లేదనే నిరాశతో నీరసపడి పోతున్నారు.

ప్రజలు తమనింత ఆదరిస్తారని చంద్రబాబు కూడా కల కనలేదు. ఒక ప్రక్క నిన్నగాక మొన్న జరిగిన స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ సాధించిన తిరుగు లేని ఆధిక్యత; మరొక ప్రక్క తెలంగాణా సెంటిమెంటు వుధృతి మధ్య తమ అభ్యర్థి నామకార్థంగా మిగిలి పోతాడని భావించారాయన. అయితే, యథాలాపంగా వాడిన వెనుకబడిన తరగతుల చిట్కా బాగా కలిసి వస్తున్నది. బిసిలందరూ తెలుగుదేశం వైపు తరలి రావడానికి ఉపకరిస్తున్నదది.

అంతకంటే ముఖ్యంగా కనిపిస్తున్న అంశం – ప్రభుత్వ వ్యతిరేక పవనాల జోరు. స్థానిక సంస్థల ఎన్నికలలో ఆనవాళ్ళు కూడా లేని ఆ పవనాలు, ఒక తుఫాను వలె హోరు పెడుతున్నాయి. బీడీ మీద పుర్రె బొమ్మ పెద్ద విషయమేమీ కాదు. కానీ ఆ చిన్న సమస్య నుంచి గట్టెక్కడానికి సోనియాగాంధీ సహకారం తీసుకోవలసి వస్తున్నది. విచిత్రంగా కరెంటు సరఫరా పెద్ద సంకటంగా మారింది కాంగ్రెస్ పార్టీకి. ప్రతి సభలో బీడీ కార్మికులడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక, ముఖం చాటించవలసి వస్తున్నది. చివరకు కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారానికి వచ్చిన సిపిఐ నేత నారాయణ కూడా ఈ నిరసన ఎదుర్కోక తప్పలేదు. ఉచిత కరెంటు పథకం వల్ల రైతాంగం తనకు శాశ్వతంగా కృతజ్ఞులై వుంటారని ఆశించారు ముఖ్యమంత్రి. కానీ అది పెద్ద ఉపకారం కాదన్న ధోరణిలో మాట్లాడుతున్నారు రైతులు. ఉచితం కంటే, చాలినంత సరఫరా చేయడమే ముఖ్యం అని ఒత్తిడి తెస్తున్నారు. ప్రచారానికి వచ్చిన కాంగ్రెస్ నేతలను నిర్దాక్షిణ్యంగా నిలదీస్తున్నారు. కరెంటు సమస్య తమ విజయావకాశాలను కాటు వేయకుండా కాపాడుకోవడానికి పగటి పూట ఏడు గంటల పాటు నిరవధికంగా కరెంటు సరఫరా చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇవ్వక తప్పడం లేదు.

ఒక్కసారిగా ప్రభుత్వం పట్ల అన్ని వర్గాలలో ఇంత వ్యతిరేకత పెల్లుబకడానికి కారణం ఏమిటి అన్న ప్రశ్నకు ఏ కాంగ్రెస్ నేత వద్దా సమాధానం లేదు. ఏదో ఒకటి చేసి, పోలింగ్ రోజులోపల ఈ మంట చల్లార్చకుంటే ముప్పు తప్పదని మాత్రం ఒప్పుకొంటున్నారు. కరీంనగర్‌లో అధికంగా వున్న ముస్లిం ఓటర్లను ఏక మొత్తంగా ఆకర్షించడం అందుకొక మార్గం అన్న వుద్దేశంతో, అందరూ ఆ వైపు మళ్లారిప్పుడు. మజ్లిస్ పార్టీ అధినేత ఓవైసీని కరీంనగర్‌కు రప్పించి, ముస్లింలంతా కాం[illegible]కు ఓటు వేయాలని చెప్పించారు.

కొరవ 7వ పేజీలో



జమీన్‌రైతు

కొత్త రూపం, రంగుల ముస్తాబు

సుదీర్ఘ కాలం నిర్విరామంగా ప్రచురితమౌతున్న ఒకే ఒక తెలుగు పత్రికగా చరిత్రలో స్థానం సంపాదించుకొన్న 'జమీన్‌రైతు' 78 సంవత్సరంలో అడుగిడబోతున్నది. ఏడున్నర దశాబ్దాల నెల్లూరు జిల్లా చరిత్రకు సజీవ దర్పణంగా, నెల్లూరీయుల జన జీవితంలో ఒక భాగంగా అంతర్లీనమై పోయిన, నెల్లూరీయుల అభిమాన పత్రికకు కొత్త రూపం సంతరించాలని నిర్ణయించాము. డిసెంబరు 29తేది సంచిక నుంచి 'జమీన్‌రైతు' పూర్తిగా కొత్త రూపంతో, పంచరంగుల ముస్తాబుతో పాఠకుల చేతికి అందుతుంది. ఇందులోని ప్రతి అక్షరం నెల్లూరీయుల గుండె చప్పుడును ప్రతిధ్వనింపజేసేదిగా తీర్చి దిద్దాలన్నది సంకల్పం. 'జమీన్‌రైతు'కు మాత్రమే ప్రత్యేకమని రుజువైన రాజకీయ సమీక్షలు, అంకుశంతో పొడిచినట్లుండే విమర్శలు, నిజాన్ని నిర్భీతిగా చెప్పే గుణంతో పాటు ఆధునిక పాఠకుల అవసరాలకు అనుగుణంగా ఎన్నో కొత్త శీర్షికలు ప్రవేశ పెడుతున్నాము. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలలో నెల్లూరీయులు సాధించే ప్రతి చిన్న విజయాన్నీ అక్షరబద్ధం చేయడం లక్ష్యం. వ్యక్తిత్వ వికాసం, సుఖసంసార సలహాలు, మహిళల అందచందాలు, మనోల్లాసం కల్గించే కథలు, సీరియళ్లు, సమకాలీన పోకడలపై విద్యార్థి లోకం అభిప్రాయాలు, మార్కెట్ అధ్యయనాలు వంటి శీర్షికలు కొత్తగా ప్రవేశ పెడుతున్నాము. అందు కోసం పేజీల సంఖ్య కూడా 12 నుంచి 16కి పెంచుతున్నాము.

ఇన్ని మార్పులు, ముస్తాబులతో పత్రికను వెలువరించడం ఎంత ఖరీదుతో కూడుకున్న అంశమో వివరించి చెప్పనవసరం లేదు. ఆ భారంలో కొంత మేర మాత్రమే పాఠకులకు పంచాలన్న వుద్దేశంతో, పత్రిక ధరను స్వల్పంగా పెంచడానికి నిర్ణయించాము. డిసెంబరు 29తేది సంచిక నుంచి విలువ పెరుగుతున్న 'జమీన్‌రైతు' వెలలో మార్పులు ఇవీ...

	పాత ధర	కొత్త ధర
విడి ప్రతి	రూ.3/-	రూ.5/-
సంవత్సర చందా	రూ.150/-	రూ.200/-
విదేశాలకు	రూ.850/-	రూ.1000/-

నాలుగు తరాలుగా 'జమీన్‌రైతు' పట్ల నెల్లూరీయుల అభిమానం తరగని సంపదగా కొనసాగుతున్నది. ఈ కొత్త మార్పులనూ పాఠకులు అదే ఆత్మీయతతో ఆహ్వానిస్తారని మా విశ్వాసం.

– సంపాదకుడు

పరిశ్రమల కంటే ముందు పాలాల కొనుగోళ్లు

మేనకూరు టెక్స్‌టైల్ పార్కులో పరిశ్రమలు వచ్చేది ఎంత వరకు నిజమో నన్న సందేహం తీరనప్పటికీ, ఆ ప్రాంతంలో పొలాల అమ్మకాలు, కొనుగోళ్లు మాత్రం భారీ స్థాయిలో జరిగి పోతున్నాయి. నెల క్రితం వరకు ఒకటి రెండు లక్షల రూపాయలకు మించి ధరలేని భూములు ఇప్పుడు పది పన్నెండు లక్షల ధర పలుకుతున్నాయి. నాయుడుపేట పట్టణంలో కూడా అంకణం స్థలం విలువ అమాంతంగా పాతిక వేలకు ఎగబ్రాకింది. జిల్లాలో పనిచేసే అధికారులు చాలా మంది టెక్స్‌టైల్ పార్కు సమాచారం ముందుగా తెలియడంతో, నాలుగైదు నెలల ఇవతల వందల ఎకరాల భూములు కొనుగోలు చేశారట. ఈ జిల్లాతో ఏ సంబంధం లేని ప్రముఖ క్రీడాకారులు కొందరు ఇక్కడ భూములు కొన్నట్లు చెప్పున్నారు. అక్కడ పరిశ్రమలు వచ్చినా రాకపోయినా రియల్ ఎస్టేట్ పెట్టుబడులు పెట్టిన వారి పంట మాత్రం బాగానే పండుతున్నది.

నెల్లూరు జిల్లా ముఖ చిత్రం మార్చగల స్థాయిలో, నాయుడుపేట దగ్గర మేనకూరు గ్రామంలో నెలకొననున్న టెక్స్‌టైల్ పారిశ్రామిక వాటికకు 25తేది మధ్యాహ్నం ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపించారు. ఆడంబరంగా, అట్టహాసంగా జరిగిందీ కార్యక్రమం. ప్రయివేటు పారిశ్రామిక వాటికకు, ప్రభుత్వ ఖర్చుతో ప్రారంభోత్సవం ఏంటని ప్రతిపక్షాలు సన్నాయి నొక్కులు నొక్కడాన్ని మనం పెద్దగా పట్టించుకోనక్కర లేదు. ప్రపంచీకరణ వ్యామోహం అలముకున్న తర్వాత పరిశ్రమల పట్ల ప్రభుత్వ దృక్పథం చాలా మారిపోయింది. కొత్త పరిశ్రమ అంటే పెట్టుబడిదారుల వ్యాపారంగా కాక, కొత్తగా వుద్యోగావకాశాలు కల్పించే ప్రజా ప్రయోజన కార్యంగా పరిగణిస్తున్నారిప్పుడు.

చదువుల మంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే శ్రీమతి నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ నియోజక వర్గ పరిధిలోకి వస్తుంది మేనకూరు గ్రామం. అందువల్ల ఈ సభ ఏర్పాట్లన్నిటినీ ఆమే స్వయంగా పర్యవేక్షించుకున్నారు. అదీకాక, వెంకటగిరి నియోజక వర్గంలో ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ పాల్గొన్న మొదటి కార్యక్రమం కూడా ఇదే. ఇరవై వేల మందికి వుద్యోగాలు చూపించే పరిశ్రమలు తన నియోజక వర్గానికి రావడం తనకెంతో ఆనందదాయకమని మురిసిపోయారు రాజ్యలక్ష్మమ్మ గారు. వీటికోసం జరుపుతున్న భూసేకరణ పట్ల స్థానిక రైతాంగంలో వ్యతిరేకత వుందన్న విమర్శలను తోసిపుచ్చారామె.

వెంకటగిరి పట్ల తరగిపోని మమకారం వున్నందువల్ల కాబోలు, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి కూడా ఈ సభకు హాజరయ్యారు. చేనేతకార్మికులు ఎక్కువగా వున్న ప్రాంతంలో నూలు మిల్లుల స్థాపన ముదావహమన్నారు. పనిలో పనిగా రాజశేఖరరెడ్డిని ప్రశంసలతో ముంచెత్తాడు. తన స్వగ్రామం వాకాడు దగ్గర రాజశేఖరరెడ్డి చొరవ వల్లనే స్వర్ణముఖిపై బ్యారేజి నిర్మాణం జరుగుతున్నదని; వచ్చే మార్చి నెలలో దాని ప్రారంభానికి వైఎస్

కొరవ 7వ పేజీలో



మేనకూరులో టెక్స్‌టైల్ పార్కును ప్రారంభించిన అనంతరం ఏర్పాటైన బహిరంగ సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి.



శివ... శివ ఎంత పని చేశావయ్యా
సస్పెండ్ అయిన నగర డిఎస్పీ కన్నాజీరావులో భక్తి విరవశ్యం.

పోలీస్ శాఖలో నీతినిజాయితీలు

అంతరించలేదని సాటి చెప్పిన సస్పెన్షన్లు!

నెల్లూరు పోలీసును అడురుదెబ్బ కొట్టారు ఉన్నతాధికారులు. పోలీసు శాఖలో నీతి నిజాయితీల అవసరం తెలిసిన వారు అంతరించ లేదని నిరూపించారు. శ్రీనివాస అగ్రహారంలో మాజీ మునిసిపల్ కౌన్సిలర్ కిన్నెర కృష్ణమూర్తి ఇంటి మీద జరిగిన దౌర్జన్యంలో రౌడీ మూకలకు సహకరించిన నగర డిఎస్పీ కన్నాజీరావు, బాలాజీనగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుపాలు, అదే స్టేషన్‌కు చెందిన సబ్ ఇన్స్పెక్టర్లు చెంచురామయ్య, సుబహాన్‌లను సస్పెండ్ చేస్తూ వుత్తర్వులు జారీ చేసింది పోలీసు శాఖ. గుంటూరు ఐజి సత్యనారాయణ సిన్హా నెల్లూరుకు వచ్చి, ప్రత్యేకంగా విలేకరుల సమావేశం పెట్టి, ఈ శుభవార్త విన్పించారు. తప్పు చేసే పోలీసు అధికారులు ఎవరికైనా ఇదే శిక్ష తప్పదని; మరొకసారి ఏ అధికారి అయినా ఇటువంటి తప్పు చేస్తే శిక్ష మరింత కఠినంగా వుంటుందని కూడా హెచ్చరించారాయన.

కిన్నెర కృష్ణమూర్తి ఇంటి మీద దౌర్జన్యం ఎంతటి దుర్మార్గ పరిస్థితులలో జరిగిందీ తెలిసిన సంగతే. అతడిని ఇంటి నుంచి ఇల్లు ఖాళీ చేయించడానికి, కడప నుంచి రౌడీలను తెచ్చి, అర్ధరాత్రి సమయంలో దాడి జరిపి, లోపలున్న వారందరినీ బలవంతంగా ఈడ్చి వీధిలో పారేసి, పొక్లెయిన్‌తో ఇల్లు కూలగొట్టారు. చవకబారు తెలుగు సినిమా తరహాలో చుట్టు ప్రక్కల ఇళ్లలో నుంచి ఎవరూ బయటకు రాకుండా వీధి పొడుగునా రౌడీలను మోహరించారు. ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారం జరిగిన ఈ దౌర్జన్యానికి స్థానిక పోలీసులు పూర్తిగా సహకరించారు. డిఎస్పీ నుంచి క్రింది స్థాయి కానిస్టేబుల్ వరకు అందరితో ముందుగా మాట్లాడుకుని మరీ దౌర్జన్యానికి దిగారు ఆ రౌడీలు. తమ పని పూర్తి అయ్యే వరకు పోలీసు అన్నవాడు ఆ ఛాయలకు రాకుండా కట్టడి చేశారు. ఆ రౌడీలిచ్చిన చిల్లర పైసలకు కక్కుర్తి పడిన అధికారులు కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా స్పందించ లేదు. చుట్టు ప్రక్కల వారు ఫోన్‌లో సమాచారం అందించినా పట్టీపట్టనట్లు వుండిపోయారు. ఈ దౌర్జన్యం తట్టుకోలేక విపరీతమైన మానసిక ఒత్తిడికి లోనైన కృష్ణమూర్తి గుండెనొప్పితో కూలిపోవడంతో భయపడి రౌడీలు పారిపోయారు తప్ప, పోలీసుకు మాత్రం దయ కలగలేదు.

తెల్లవారి ఈ సంఘటన బయటపడగానే, నెల్లూరు మొత్తం గగ్గోలు లేచింది. ఫ్యాక్షన్ గ్రామాలలో తప్ప కన్పించని రౌడీ సంస్కృతి నెల్లూరుకు దిగుమతి చేసిన వారందరినీ జనం ఈసడించారు; నిరసించారు. ఈ విష సంస్కృతిని అనుసరిస్తే పౌర జీవనంలో శాంతి అన్నది మృగ్యమై పోతుందని ఆవేదన చెందారు. అప్పటి ఎస్పీ సూర్యనారాయణ కూడా దీని పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటనకు వచ్చి అది జరిగిన తీరు తెలుసుకున్న ఆయన, సంబంధిత పోలీసు అధికారుల మీద మండి పడ్డారు. కనీసం ఇప్పటికైనా దోషులైన వారి మీద చర్య తీసుకోమని హెచ్చరించారు. కానీ రాజకీయవాదుల నుంచి పూర్తి మద్దతు వున్న డిఎస్పీ, సివిల్ – ఎస్పీ మాటలు కూడా లెక్కచేయలేదు. ఎమ్మెల్యేలు కొందంత అండగా వున్నప్పుడు నువ్వు మమ్మల్నేమి చేయగలవు అనే నిర్లక్ష్యంతో వ్యవహరించారు.

అయితే 'జమీన్‌రైతు' ఈ దుర్ఘటనను తీవ్రంగా దుయ్యబట్టింది. పోలీసు శాఖ ప్రతిష్టను, దానిపై ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసే ఇటువంటి దుర్మార్గాలను అనుమతించడం పట్ల కఠినమైన మాటలతో విమర్శించింది. ఆ మాటల పదునుకు ప్రతి పోలీసు అధికారీ మనస్తాపం చెందాడు. వారిలో అప్పటి ఎస్పీ గారు కూడా ఒకరు. దానితో ఆయన తమ వున్నతాధికారులకు మొత్తం సంఘటనపై సమగ్ర నివేదిక సమర్పించారట. వారూ దీన్ని తీవ్రంగానే పరిగణించారు. ఎస్పీ నివేదికతో పాటు, తమ స్థాయిలో కూడా దర్యాప్తు జరిపి, నిజమని నిర్ధారించుకున్న తర్వాత, సంబంధిత పోలీసు అధికారులందరికీ సస్పెన్షన్ శ్రీముఖాలు పంపారు.

తప్పు చేసే పోలీసు అధికారులకు నిజంగానే కఠినమైన హెచ్చరిక ఇది. మరొకసారి మరొక అధికారి ఆ తప్పు తిరిగి చేయకుండా కాపాడే చర్య. తమ శాఖలోని తప్పుడు మనుషుల పట్ల నిర్మొగమాటంగా వ్యవహరించిన వున్నతాధికారులను అభినందించి తీరాలి. అయితే డిఎస్పీని కూడా సస్పెండ్ చేయగలిగారే తప్ప, ఈ దౌర్జన్యానికి బాధ్యులైన రౌడీ మూక మీద ఎటువంటి చర్యా తీసుకోలేక పోతున్నారు అధికారులు. ఈ సంఘటన జరిగి రెండున్నర నెలలు గడిచి పోయాయి. కానీ ఇప్పటి వరకు కీలక సూత్రధారి అయిన గద్దం ప్రసాద్ అనే గూండాను అరెస్ట్ చేయలేదు. అతడికి సహకరించిన రౌడీలను గుర్తించలేదు. దౌర్జన్యానికి

కొరవ 7వ పేజీలో

నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ విద్యావంతులకు విజ్ఞప్తి

కేంద్రంలో రాజ్యసభ, రాష్ట్రాలలో శాసన మండలి ఏర్పాటు ప్రతిపాదిత ఉద్దేశ్యం - లోక్‌సభలోగాని, రాష్ట్ర శాసన సభలోగాని, రాజకీయ అంశాలతో తలమునకలై, సభ్యులు ప్రజా సంబంధిత చట్టాలు, సమస్యలపై నిశితంగా చర్చించలేని పరిస్థితులలో ఆ లోటును మేధావి వర్గాలు స్థానిక సంస్థల ప్రతినిధుల భాగస్వామ్యంతో భర్తీ చేయడం.

ఐవి పార్టీ రహిత ఎన్నికలుగా ఎన్నికల చట్టం నిర్దేశించింది. అభ్యర్థులకు పార్టీ పరంగా 'బి' ఫారం ఇవ్వడంగాని, పార్టీల గుర్తులు కేటాయించడం కాని జరగదు. అధికార పార్టీ పాలనపై రెఫరెండమూ కాదు. ప్రతిపక్ష పార్టీని గద్దె నెక్కించే క్రమంలో జరిగే ఎన్నికలు కావు. 1985లో శాసన మండలిలో కాంగ్రెస్ పార్టీకి ఆధిక్యత ఉన్న కారణంగా తెలుగుదేశం ప్రభుత్వం నాటి శాసన మండలిని రద్దు చేసింది. 2006 సం॥ శాసన మండలి జిల్లు చర్చ సందర్భంగా మండలి ఏర్పాటు చేయడం ప్రజా ధనం దుర్వినియోగం చేయడమే అని, రాజకీయ నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు కేంద్రంగా ఉపయోగపడడానికే అని వ్యతిరేకించిన కొన్ని రాజకీయ పార్టీలు నేడు ప్రత్యక్షంగా, మరికొన్ని పరోక్షంగా తమ అనుబంధ సంఘాల ద్వారా తమ అభ్యర్థులను నిలిపి మీ ముందుకు వస్తున్నాయి. స్థానిక సంస్థల నుంచి మండలికి జరిగే ఎన్నికలలో పార్టీ రహితంగా ఎన్నికైన సర్పంచులకు ఓటు హక్కు నిరాకరించి, పార్టీ ప్రాతిపదికన ఎన్నికైన యం.పి.టి.సి., జడ్.పి.టి.సి. సభ్యులకు ఓటు హక్కు మండలిలో కలిగించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ కూడా మండలిని మరో మినీ అసెంబ్లీగా భావిస్తుంది. శాసన మండలిని రాజకీయ దృక్పథంతోనే ఆలోచిస్తే, మండలి ఆవశ్యకత ఏమిటి? నేటి ప్రతిపక్షం పాలక పక్షమైతే మండలిని మరోసారి రద్దు చేయరని హామీ ఇవ్వగలరా? శాసన మండలి పాత్ర మీద ఎవరికైతే విశ్వాసముందో ఆ పార్టీలకే ఓటు అడిగే నైతిక హక్కు ఉంది.

పార్టీ రాజకీయాలకు అతీతంగా, నిజాయితీ, నైతిక విలువలు, సామర్థ్యం కలిగిన అభ్యర్థులకు ఓటు వేయగలిగిన ఒక అరుదైన అవకాశం ఈ పట్టభద్రుల ఎన్నికలు. రాజకీయ అవినీతి, ధనం, మద్యం ప్రభావంతో కలుషితమైన నేటి రాజకీయ వ్యవస్థను ప్రక్షాళనకు శ్రీకారం చుడుదాము. ఈ ఆశయాలు, ఆలోచనలకే పరిమితం కాకూడదు... ఓటరుగా నమోదు చేసుకొనుటకు డిసెంబర్ 7వ తేది వరకు ఆఖరి అవకాశం ఇవ్వబడినది. దీన్ని సద్వినియోగం చేసుకుందాం!

గతంలో మీరు ఓటరుగా చేరలేని కారణాలు వివరిస్తూ ధృవీకరణ పత్రంను ఫారం -18తో జత పరచవలసినది.



ఆముంచర్ల శంకరనారాయణ, B.Com., B.L., FCA., D.I.S.A. (ICA)
Chartered Accountant, Nellore. Phone : 0861 - 2331324, 94402 75968

నమ్మకం పెంచిన తీర్పులు

చట్టానికి చేతులు చాలా పొడవని చెప్తుంటారు. సంజయ్‌దత్, శిబూ సొరెన్‌లు, రెండు విడివిడి కేసులలో నేరస్తులుగా నిర్ధారణ కావడంతో, ఆ మాటలోని వాస్తవికత నిరూపణైంది. వీరిద్దరూ దేశంలోనే ప్రముఖులు. అంగ, ఆర్థిక, రాజకీయ బలం కల్గినవారు. తమ పలుకుబడితో చట్టాలను తారుమారు చేయగల్గిన వారు. నేర పరిశోధనపై పలుకుబడి ప్రయోగించ గల్గినవారు. అటువంటి వారిపై కేసులు నిలవవన్నది జనాభిప్రాయం. రాజకీయ, ఆర్థికరంగ ప్రముఖుల విషయాలలో పలుమార్లు అనుభవంలోకి వచ్చిన నిష్ఠూర నిజమది. కాని ఈ రెండు కేసులలో నేర పరిశోధన జరిపిన సిబిఐ, విచారణ జరిపిన న్యాయస్థానాలు చట్టానికి ఎవరూ అతీతులు కాలేరని నిరూపించాయి. న్యాయ వ్యవస్థ ప్రతిష్టను కోరుకునే వారందరికీ సంతృప్తి కల్గించే పరిణామమిది.

దేశంలోనే అత్యంత వివాదాస్పద ఆదివాసీ నాయకుడు శిబూ సొరెన్. జార్ఖండ్ రాష్ట్రంలోని లక్షలాది మంది గిరిజనులకు "గురూజీ" ఆయన. జార్ఖండ్ రాష్ట్రం ఏర్పాటు సైతం ఆయన ఉద్యమ ఫలితంగా ఏర్పడినదే. పివి నరసింహారావు ప్రధానిగా వున్న సమయంలో, అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేయడానికి రెండు కోట్ల రూపాయలు ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణ వెలుగులోకి వచ్చినప్పటి నుంచి శిబూ సొరెన్ జీవితం గతి తప్పింది. పార్లమెంటరీ హక్కుల ప్రాతిపదికపై సుప్రీం కోర్టు తీసుకొన్న విధానపర నిర్ణయాలతో ముడుపుల కేసు నుంచి బయట పడ్డారాయన. అయితే ఆ సంతోషం ఎంతోకాలం నిలవలేదు. ఈ ముడుపుల వ్యవహారం సమగ్రంగా తెలుసుకొని, బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించిన తన వ్యక్తిగత కార్యదర్శి శశినాథ్ ఝూ హత్య కేసు మెడకు చుట్టుకొన్నది. 1994లో హత్య జరిగితే, 1998 వరకు దాన్ని తొక్కి పెట్టగలిగాడు. కాని, సిబిఐ రంగ ప్రవేశంతో నిజాలు బయట పడిపోయాయి.

శిబూ సొరెన్ మీద క్రిమినల్ కేసులున్నాయని అందరికీ తెలుసు. కాని అత్తెసరు మెజారిటీతో నడుస్తున్న యుపిఏ ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి, నేర చరిత్ర ప్రక్కన పెట్టి, ఆయన్ను మంత్రివర్గంలో కొనసాగించారు. మధ్యలో ఒక సారి బలవంతంగా రాజీనామా చేసినా, మళ్లీ అవకాశమిచ్చారు. దాని ఫలితమే – జైలు శిక్ష పడిన తొలి కేంద్రమంత్రిగా శిబూ సొరెన్; హత్యానేరంలో నిందితుడిని తన క్యాబినెట్‌లోకి తీసుకొన్న ప్రధానిగా మన్మోహన్‌సింగ్ అపఖ్యాతి మూట కట్టుకోవడం.

జమీన్‌రైతు

సంజయ్‌దత్ కేసు ఇందుకు భిన్నమైనది. చెడు అలవాట్లు, చెడు స్నేహితాల ఫలితంగా నేర ప్రపంచంతో సంపర్కం పొందాడు. దానితో 250 మంది అమాయకుల ప్రాణాలు తీసిన బొంబాయి పేలుళ్ల దురంతం ఆయన మెడకు చుట్టుకొన్నది. ఆ ఉగ్రవాదులతో స్నేహం వల్ల లైసెన్స్ లేని పిస్టల్స్, ఎకె 56 మర తుపాకులు తన ఇంట్లో పెట్టుకొన్నాడు. సిబిఐ దర్యాప్తులో అది బయట పడింది. దానితో బొంబాయి పేలుళ్లతో సంజయ్‌దత్‌కు సంబంధం వుందన్న సందేహాలు తలెత్తాయి. 13 ఏళ్ల పాటు ఆ నిందను భరిస్తూ, మానసిక చిత్రహింస అనుభవించాడు. మధ్యలో 18 నెలలు జైలులో గడిపాడు. సినిమా, రాజకీయ రంగాలలో ప్రాభవం, కేంద్రమంత్రి పదవి కల్గిన సునీల్‌దత్, ఎంత ప్రయత్నించినా కుమారుడ్ని కేసు నుంచి బయట పడవేయలేక పోయాడు. చివరకు న్యాయదేవత కరుణే, సంజయ్‌దత్‌ను గుడ్డిలో మెల్లగా గట్టెక్కించింది. అతడు ఉగ్రవాది కాదని ప్రకటిస్తూనే, లైసెన్స్ లేని ఆయుధాలు కల్గి వున్నందుకు స్వల్ప శిక్ష వేసింది న్యాయస్థానం.

నేర దర్యాప్తు సంస్థలు, న్యాయ స్థానాలు నిష్పాక్షికంగా వ్యవహరిస్తే చట్టం పిడికిలి నుంచి ఎంత పెద్దవారూ తప్పించుకోలేరన్న అభిప్రాయం కల్గించడం – ఈ రెండు కేసుల ప్రత్యేకత. ప్రజలలో న్యాయ వ్యవస్థపై నమ్మకం పెంచడానికి అది ఎంతగానో ఉపకరిస్తుంది; ఆ నమ్మకం ప్రజాస్వామ్యానికి ఎంతో బలం చేకూరుస్తుంది.

జమీన్‌రైతు

30-11-1956

పేజీలు: 12 వెల:0-2-0

గోపాలరెడ్డి గారు మంత్రివర్గంలో చేరారు

ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డి గారు, ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలో చేరుటకు నిర్ణయించుకొన్నారు. ఈ రోజు ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. 30 రోజులుగా వుండిన ఈ ప్రతిష్టంబన పరిష్కారమై పోతున్నది.

గోపాలరెడ్డి గారు ఈ నిర్ణయం ఏనాడో ప్రకటించిన వుందురు. సంజీవ రెడ్డి గారు కోరినప్పుడు, కాంగ్రెస్ అగ్ర నాయకులు చెప్పినప్పుడే చేరి వుందురు. తన అనుచరుల అభ్యంతరము అటుంద నిచ్చి, మంత్రివర్గ నిర్మాణంలో సంజీవరెడ్డి గారు అవలంభించిన వైఖరి వారికి గిట్ట నందువల్లనే చేరలేదేమోనని పిస్తుంది. ఈ విషయం వారు అక్టోబర్ 28తేదీ సంజీవ రెడ్డి గారికి వ్రాసిన ఉత్తరాన్ని బట్టి మనం వూహించుకోవచ్చు. మంత్రిత్వాల కోసం ఆయన బేరం సాగించలేదు, వ్యక్తుల విషయం పట్టించుకోలేదు గాని, ఒకే ముఠాలో, అనుభవం లేని వారితో ఏర్పడ్డ మంత్రి మండలిలో తాను చేరి పనిజేయగలనా? దానివల్ల ప్రయోజనమంటుందా? అనే సందేహం వారిని ప్రథమంలో విముఖులను గావించింది. తన అనుచరుల ఒత్తిడి గుడా లేదని మేము చెప్పం గాని, దీని కంటే పై విషయమే వారిని మీమాంసలో ముంచింది. ఈ 30 రోజులు విశ్రాంతిగా యింటి దగ్గర వున్నాడనే గాని, ఎన్ని వందల మంది హితుల సలహాలు తీసుకొని వుంటారో, ఎంత తీవ్రంగా ఆలోచించి వుంటారో చెప్పలేము. ప్రతి నిముషము ఈ మీమాంసలో గడిపి వుంటారంటే అతిశయోక్తి గాదు. ముఖ్యమంత్రిగా తాను 'తపస్సు' చేయవలసి వచ్చింది అన్నారు గోపాలరెడ్డి గారు. అప్పుడు తపస్సు చేశారో లేదో గాని; మంత్రివర్గంలో చేరమనేవారు, వద్దనేవారు; మంత్రిత్వాల విషయంలో బేరాలు సాగించమనే వారు, షరతులు లేకుండా ప్రవేశించమనేవారు – ఈ విధమైన పరస్పర విరుద్ధ అభిప్రాయాల మధ్య, భావ సంఘర్షణల మధ్య ఈ నెల రోజులు మాత్రం కఠోర తపస్సు చేశారనే చెప్పవలసి వుంటుంది. ఈ మంత్రిత్వ స్వీకారం వారి అంతస్తుకు తగినది కాదని ఈ నాటికి భావించే వారి అభిమానులుండిటా, వారి అనుభవము, నిలకడైన తత్వము, స్థిరమైన విధానము, సేవనాత్మ ఆంధ్రప్రదేశ్‌కు లభించడం సంతోషించదగిన విషయం.

నెల్లూరు పార్లమెంటు సీటు

ఎన్నికలు 57 నవంబరు వరకు వాయిదా పడే అవకాశాలున్నట్లు గట్టిగా తెలుస్తున్నది. బొంబాయిలో కాంగ్రెసు ప్రతిష్ట కొంత దెబ్బతినడం, బెంగాలు, కేరళ ప్రాంతాలలో కమ్యూనిస్టు ప్రభుత్వం వస్తుందనే భయం కాంగ్రెసు హైకమాండ్‌కు వుండడం యిందుకు కారణాలంటున్నారు. ఏది ఎలాగున్నా మొరార్జీ – పాటిల్‌లు ఎన్నికలు మార్చిలోనే జరగాలన్నారు. పంత్ గారిది కూడా ఇదే అభిప్రాయం. మొన్న ఢిల్లీలో జరిగిన రాజకీయ పార్టీల సమావేశంలో కొన్ని పార్టీలు ఫిబ్రవరిలో జరగాలని, కొన్ని మార్చిలో సూచించాయట.

నెల్లూరు నియోజక వర్గం నుంచి జనరల్ సీటుకు బెజవాడ రామచంద్రారెడ్డి గారు, రిజర్వుడు సీటుకు బి.ఎన్.మూర్తి పోటీ చేయవచ్చునని ఇక్కడ పదంతి. రెడ్డి గారికి ప్రత్యర్థిగా కాంగ్రెసు వారు నిలబెట్టకుండేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అడుసుమిల్లి సుబ్రహ్మణేశ్వర రావు కాంగ్రెసుకు వ్యతిరేకంగా ఓటు చేసినప్పటికీ వారికి పోటీగా కాంగ్రెసు అభ్య

తరువ 10వ పేజీలో

డొక్కు బస్సులతో ఇంకెన్నాళ్లు?

మన రాష్ట్రంలోని ఆర్టీసీని డొక్కు బస్సులు నడిపే సంస్థగా అందరూ అభివర్ణిస్తుంటారు. ఇటీవల హైకోర్టు కాలం తీరిన పాత బస్సులను నవంబరు 1తేది తర్వాత రోడ్ల మీద తిప్ప వద్దంది. అయినా పాత బస్సులను అలాగే నడుపుతున్నారు. ప్రజలకు కాలం తీరిన ఆర్టీసి బస్సులేవో తెలియడం లేదు. బస్సు మీద ఈ వివరం వ్రాస్తే ప్రజలు తెలుసుకొంటారు. కాలం తీరిన బస్సులను గుర్తించను కాలుష్య నివారణ మండలి, వినియోగదారుల సంఘ సభ్యులకు ఆర్టీసి బస్సు డిపోలు తనిఖీ చేసే అధికారం ఇస్తే బాగుంటుంది. ప్రజా శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని కాలం తీరిన బస్సులను తిప్పడాన్ని ఆర్టీసి మానాలి.

గూడూరు జి.రామారావు

ప్రజల కోసం పనిచెయ్యండి

నెల్లూరులో ఆపరేషన్ డెంగ్యూ కా క్రమాన్ని నాయకులు, అధికారులు కలిసి ఎంత గందరగోళం చేస్తున్నారో నవంబరు 17తేది 'జమీన్‌రైతు'లో ప్రచురితమైన ఫొటో స్పష్టం చేసింది. నెల్లూరు నేతల్లో చిత్తశుద్ధి లేకపోవడం వల్ల నగరంలో రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయి. పారిశుధ్య పరిస్థితులు క్షీణించాయి. వీధి లైట్లు అంతంత మాత్రంగానే వెలుగుతుంటాయి. అయితే రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నెల్లూరు నేతలు రోడ్లపై తిరుగు తుంటారు. మాయమాటలు చెప్పి, ప్రత్యర్థులను విమర్శించే విషయంలో చూపే శ్రద్ధను ప్రజా సమస్యలను తీర్చడంలో చూపడం లేదు.

హైదరాబాద్ ప్రా॥నాగరాజారావు

జనవాణి

మహిళలంటే చులకనా?

ప్రతి పార్లమెంటు సమావేశాల్లోనూ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్ట సవరణ చేసే బిల్లు అజెండాలో వుంటుంది. కాని బిల్లును చట్ట రూపంలోకి తీసుక రావడంలో మాత్రం ఏకాభిప్రాయం మంత్రాన్ని పఠిస్తూ కాలయాపన చేస్తుంటాయి. దీనివల్ల బిల్లు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుంది. మహిళా బిల్లును 1996లో పార్లమెంటులో ప్రవేశ పెట్టారు. కాని గత

తరువ 10వ పేజీలో

అత్యంత ఆధునిక వైద్య పరికరాలు కల్గిన ఏకైక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా పేరుగాంచిన
మీ స్మైల్ దంత వైద్యశాల 7 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని
ఉచిత దంత వైద్యసేవలు
1.12.06 నుండి
15.12.06 వరకు

ఉచిత కన్సల్టేషన్ - ఉచిత దంత పరీక్షలు
సలహాలు - సంప్రదింపులు

- పంటి నొప్పా? పీకించు కొందామనే ఆలోచన వద్దు
- విరిగిన పళ్ళను కాస్మొటిక్ చికిత్సతో అందంగా సరిదిద్దవచ్చా?
- పళ్ళు పీకిన లేదా ఊడిన రోజు కృత్రిమ దంతాలు అమర్చవచ్చా?
- రోజూ తీయనవసరం లేకుండా అమర్చే పళ్ళు వున్నాయా?
- వంకర పళ్ళను ఒక్కరోజులో సరిచేయవచ్చా?
- పళ్ళ మధ్య సందులు సరిచేయగలమా?

అన్ని దంత సమస్యలకు ఉచిత సలహాలు, సంప్రదింపులతో పాటు సిరామిక్ కట్టుడు పళ్ళు, ఎత్తు పళ్ళు మరియు అన్ని దంత సమస్యల ట్రీట్‌మెంట్‌పై

30% రాయితీ

మరిన్ని వివరములకు

స్మైల్ సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల

రమేష్‌రెడ్డి నగర్, నెల్లూరు - 3. ఫోన్: 0861 - 2330949. సెల్: 92464 34447

నెల్లూరు సంగతులు

కొత్తూరులో క్రిమినల్స్‌గ్యాంగ్

నూనూగు మీసాల నేరగాళ్లు

నెల్లూరు నగర శివారు ప్రాంతమైన కొత్తూరు నేరస్తులకు నిలయంగా మారింది. మోటారు సైకిళ్లపై పొదలకూరు వైపు వెళ్లే భార్యాభర్తలను గమనించి, వెంబడించి వారి వద్ద వుండే విలువైన వస్తువులు దోచుకెళ్తుండిన 15 మంది యువకుల ముఠాను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంకో ముఠా సైతం ఇదే పనిలో వుందని పోలీసులు గుర్తించారు. కొత్తూరు, రామకోటయ్య నగర్ ప్రాంతాలకు చెందిన అల్లరి, చిల్లరి యువకులు ఆటోడ్రైవర్ల అవతారమెత్తారు. నెల్లూరు నుంచి పొదలకూరు వైపు స్కూటర్లపై వెళ్తుండే భార్యాభర్తలను గుర్తించి వెంబడించి మార్గ మధ్యమంలో అటకాయించి అందినంతమేర దోచుకొనేవారు. యువతీ యువకులు కనపడితే యువకులను పక్కన కట్టిపడేసి యువతులపై అత్యాచారానికి ఒడిగట్టిన ఘటనలున్నాయి. అయితే స్టేషన్ వరకూ ఎవరూ రాకపోవడంతో పోలీసులు పట్టించుకోలేదు. వారం పది రోజుల క్రితం పొదలకూరుకు మోటారు బైకుపై వెళ్తుండిన వ్యక్తిని నలుగురు వ్యక్తులు ఆటోలో వెంబడించి కత్తులతో బెదిరించి దోచుకొన్నారు. అతను ఆటోనెంబరు గుర్తు పెట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ప్రత్యేక బృందం రంగంలోకి దిగి ఏడు మందిని అరెస్ట్ చేసింది. ఆ తర్వాత మరో ఎనిమిది మందిని పట్టుకొన్నారు. ఆటోల్లో వెళ్లే వృద్ధ మహిళలను సైతం వీరు దోచుకొన్నట్లు పోలీసు విచారణలో తేలింది. మహిళలపై మత్తు మందు చల్లి అన్నీ దోచుకొనే వారని లాఠీ ప్రయోగంతో ముఠా సభ్యులంతా

కొరవ 11వ పేజీలో



నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో పోలీసులకు ఏర్పాటు చేసిన వుచిత వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఐజి సత్యనారాయణ్. వేదికపై ఎస్పీ లక్ష్మీరెడ్డి. స్వర్ణభారత్ ట్రస్టీ దీపా వెంకట్ వున్నారు.

లంచాలకు స్వర్ణయుగం

ఎస్పీ 'సూర్య' కాయం

నెల్లూరు ఎస్పీగా సూర్యనారాయణ పనిచేసిన కాలం అవినీతిపరులైన అన్ని స్థాయిల్లోని పోలీసు అధికారులకు స్వర్ణ యుగమని చెప్పాలి. డిఎస్పీలు మొదలుకొని కానిస్టేబుళ్ల వరకు అందినంత మేర దోచుకొన్నారు. సూర్యనారాయణ అవినీతి పరుడు కాకపోయినా ఆయన వుదాసీన వైఖరి పోలీసులను అవినీతి ఊబిలో కూరకపోయేట్లు చేసింది. ఆయన హయాంలో గతంలో ఎప్పుడూ లేనట్లుగా పది మంది పోలీసు అధికారులు అవినీతి ఆరోపణలపై సస్పెన్షన్లకు గురయ్యారు. నెల్లూరు మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సైమన్ ఓ కేసులో వేదాయపాళెం సెంటర్‌లో పబ్లిక్‌గా లంచం తీసుకొంటుండగా ఎసిబి రైడ్ చేసి పట్టుకొంది. కోవూరు సిఐ విజయభాస్కర్ ఆయన ఛేంబర్‌లో లంచం తీసుకొంటుండగా ఎసిబి అధికారులు పట్టుకొన్నారు. కోవూరు స్టేషన్‌లో పనిచేసే ఓ కానిస్టేబుల్ పేకాట క్లబ్ నిర్వహిస్తున్న విషయం ఆధారాలతో సహా రుజువవ్వడంతో సస్పెండ్ చేశారు. నెల్లూరు శ్రీనివాస అగ్రహారంలో మాజీ కౌన్సిలర్ కిన్నెర కృష్ణమూర్తి ఇంటి ధ్వంస రచనకు ఐదు లక్షల రూపాయల ప్యాకేజి పుచ్చుకొన్న నెల్లూరు నగర డిఎస్పీ కన్నాజీరావు, బాలాజీ నగర్ సిఐ తిరిపాలు, ఎస్ఐ చెంచురామారావు, త్రీటౌన్ ఎస్ఐ సుబహాన్, ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండ్ అయ్యారు. జిల్లా చరిత్రలో అవినీతి ఆరోపణలపై ఇంతమంది పోలీసు అధికారులు సస్పెండ్ కావడం ఇదే ప్రథమం. ఈ అవినీతి చరిత్రను కొత్త ఎస్పీ లక్ష్మీరెడ్డి రూపుమార్చక పోతే ప్రజల్లో పోలీసు ప్రతిష్ఠ మరింత దిగజారుతుంది.

దెయ్యం కహానీ వెనుక మిస్టరీ

నెల్లూరు నగరంలో దెయ్యం కనపడిందన్న వార్త దావాలనంలా వ్యాపించడంతో నాలుగు రోజులుగా అందరూ ఈ విషయాన్ని చర్చిస్తున్నారు. రామలింగాపురంలోని ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో 24తేది రాత్రి నైట్‌డ్యూటీ చేస్తుండిన తాను దెయ్యాన్ని చూశానని, ఫొటోలు కూడా తీశానని అటెండర్ శ్రీధర్ చూపెట్టడంతో తలోరకంగా మాట్లాడుతున్నారు. తాను అర్ధరాత్రి మూత్ర విసర్జనకు వచ్చిన సమయంలో తనముందు తెల్లని ఆకారం వెళ్లిందని, తాను ఈ వ్యవహారాన్ని సెల్‌ఫోన్‌లో బంధించానంటున్నాడు శ్రీధర్. ఆ తర్వాత కూడా శబ్దాలు రావడంతో మళ్లీ బయటకు వచ్చి చూడగా దెయ్యం కనపడిందంటున్నాడు. సెల్‌ఫోన్‌తో తీశానని చెప్తున్న ఫొటోలు ప్రత్యేక ఆకారంగా వుండడంతో ప్రజలకు పలు సందేహాలు కలుగుతున్నాయి. కార్యాలయంలో రాత్రివేళ శబ్దాలు వినిపిస్తాయని, ఇక్కడ పనిచేసే వుద్యోగులు చెబుతుండగా, ఈ పుకారు వ్యభిచారం, పేకాటరాయుళ్ల సృష్టేనని స్థానికులు త్రోసి పుచ్చుతున్నారు. దెయ్యం పుకారుతో కార్యాలయంలో వుద్యోగులు ఆరు గంటలలోపే ఇళ్లకు వెళ్లిపోతున్నారు. మహిళా వుద్యోగులు తాయెత్తులు కట్టుకొని మరీ విధులకు హాజరవుతున్నారు. సెల్‌ఫోన్‌తో తీసిన ఫోటోలను పరిశీలించి చూస్తే కంప్యూటర్ మాయాజాలం దాగి వుంది. జన విజ్ఞాన వేదిక, హేతువాదులు, పోలీసులు రంగంలోకి దిగి ఈ దెయ్యం వెనుక దాగిన మిస్టరీని ఛేదించాలి. నిజంగా దెయ్యాలుంటే మనుషుల అకృత్యాలు కొనసాగుతాయా?

పోలీసుల్లో "కుల చిచ్చు"

రోడ్డు మీదకు రవాణా శాఖాధికారులు

నెల్లూరు పోలీసు అధికారుల సంఘం నాయకుడు శ్రీహరి, ట్రాఫిక్ ఆర్ఐ సుబ్బరాజు మధ్య రేగిన గొడవ చిలికి చిలికి గాలివానగా మారింది. శ్రీహరిపై ఎస్సీ అట్రాసిటీ కేసు పెట్టించాలని సుబ్బరాజు, సస్పెండ్ అయిన డిఎస్పీ కన్నాజీరావు చేత ప్రయత్నం చేయడంతో రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం జోక్యం చేసుకొంది. ట్రాఫిక్ కానిస్టేబుళ్లను ఆర్ఐ సుబ్బరాజు తమను మానసికంగా వేధిస్తున్నాడని కొందరు కానిస్టేబుళ్లు పోలీసు అధికారుల సంఘం నాయకుడు శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సుబ్బరాజును పిలిపించి మాట్లాడినప్పుడు ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో సుబ్బరాజు ఎస్సీ అట్రాసిటీ కేసు అస్త్రాన్ని శ్రీహరిపై ప్రయోగింప చూశారు. దీంతో సుబ్బరాజు ట్రాఫిక్ సిబ్బంది లేకుండానే చేస్తున్న డ్రామా, ఆయన ఇంట్లో పని మనుషులుగా వున్న ఇద్దరు మహిళా హోంగార్డులు, ఇద్దరు జిడిలు, మరో ఇద్దరు కానిస్టేబుళ్ల వివరాలను సంఘం నాయకులు సేకరించారు. నగరంలో నడిచే కోమిట్ల, దూడల, గ్లోబల్ బస్సు సర్వీసులతో పాటు ఏయే దుకాణదారుల వద్ద ఆర్ఐ ఎంత నెల మామూళ్లు వసూలు చేస్తారన్న వివరాలన్నీ సేకరించి ఎస్పీ టేబుల్‌పై పెట్టినట్లు తెలిసింది. నగరంలో పోలీసులంతా ఏదోరకంగా అవినీతి ఊబిలో కూరుకొని వుండడంతో చర్యలకు ఎస్పీ తటపటాయిస్తున్నారు. పోలీసు అధికారుల సంఘ నాయకుడు, ట్రాఫిక్ ఆర్ఐల మధ్య గొడవ ఇంకెంత దూరం పోతుందో వేచి చూడాల్సిందే!

తప్పుడు కేసుల గోల

వాడుతున్నారా అనే విషయాన్ని కూడా పరిశీలించారు. ఈ తనిఖీలో వెహికల్ ఇన్‌స్పెక్టర్లు డి.సుధాకరరావు, వై.సుధాకర రెడ్డి, వి.ఎస్.ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

ఐఎంఎల్ డిపోకు ఆనం మనుషులు!

నెల్లూరుకు కూతవేటు దూరంలోని నరసింహకొండ వద్ద వుండే లిక్కర్ డిపోలో పనికి 50 మంది మనుషులను రావూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి దించడం రచ్చకు దారితీసింది. ఈ డిపోలో

తొరవ 11వ పేజీలో

అశ్రునివాళి



నేత్ర సమర్పకులు

యడ్లపల్లి అనసూయాదేవి గారు

స్వర్గీయ Rtn. యడ్లపల్లి వెంకటేశ్వర్లు గారి సతీమణి

ఆప్యాయత, ఆదరణ, అనురాగాలతో అందరిని ఆదరించి, మమతానురాగాలు మూర్తీభవించిన మా ఇంటి దైవం **యడ్లపల్లి అనసూయాదేవి గారు**

తే 24-11-2006 ది ఉదయం గం॥ 5-00 లకు స్వర్గస్తురాలైనారు.

ఆ పుణ్యమూర్తికి అశ్రునివాళులు అర్పిస్తూ వారి పవిత్ర ఆత్మకు శాంతి కలిగించాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

ఉత్తరక్రియలు :

తే 8-12-2006 ది శుక్రవారము శిలోద్వాసన
తే 9-12-2006 ది శనివారము సపిండీకరణ (పొత్తర్లు)
తే 10-12-2006 ది ఆదివారము ప్రబంధ తొడకం (సేవాకాలం), **వైకుంఠసమారాధన**

నెల్లూరు, పోలీసు ఆఫీసు రోడ్డు, దర్గామిట్ట, నెం.24/2/229/1 లోని మా స్వగృహమునందు జరుగును. కావున తెలియజేయడమైనది.

కుమారుడు: Ln. **యడ్లపల్లి శ్రీనివాసరావు (సురేష్)** P.D.G.
కోడళ్లు: Ln. **యడ్లపల్లి అమృతవల్లి, యడ్లపల్లి ప్రమీల**, W/o. Late యడ్లపల్లి సుధాకర్

మనుమళ్ళు :
యడ్లపల్లి సంజయ్
D. కిరణ్ కుమార్

మనుమరాండ్రు :
బాలభారతి
D. సుష్మ
యడ్లపల్లి స్వాతి

మునిమనుమరాలు : **D. సాన్వి**

జిల్లా వార్తలు

శివార్లలో 'అన్న'ల బాంబులు

జిల్లా సరిహద్దుల్లోని బాటసింగన పల్లి అటవుల్లో మావోయిస్టుల డంప్‌ను గ్రేహౌండ్స్ పోలీసులు గుర్తించారు. ఈ డంప్‌లో ఎకె 47 తుపాకులు, ఎస్ఎల్ఆర్ 303 రైఫిళ్లు పెద్ద మొత్తంలో దొరికాయి. కడప జిల్లా ఎస్పీ నాగిరెడ్డి ఎదుట లొంగిపోయిన మావోయిస్టు దశరథ ఇచ్చిన సమాచారం

పోలీసుల్లో కలకలం

ఆధారంగా గ్రేహౌండ్స్ దళాలు మావోయిస్టు రాయలసీమ దళ కమాండరు ఓబులేసుతో పాటు ఎనిమిది మందిని ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారు. 27తేది ఈ దళ సభ్యులు దాచి వున్న ఆయుధాల డంప్‌ను రౌండప్ చేశారు. ఇక్కడ దాచిపెట్టిన ఆయుధాలు మొత్తం

కొరవ 8వ పేజీలో



వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో వుచిత గుండె వ్యాధుల నిర్ధారణ శిబిరాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న బిజెపి జాతీయ నేత వెంకయ్య నాయుడు. ప్రక్కన చెన్నై విజయ హార్ట్ ఫౌండేషన్‌లో డాక్టర్ విజయకుమార్, కార్యక్రమ నిర్వాహకురాలు దీపా వున్నారు.

10లక్షలకు మరో కుచ్చు టోపీ

బుచ్చిలో రెండు వారాల క్రితం గోతాలమ్మే బాబు అనే వ్యక్తి 50 లక్షలకు గ్రామస్తుల నెత్తిన కుచ్చుటోపి పెట్టిన విషయం మరవక ముందే, ఆయన బావమరిది, బావ బాటలో నడిచాడు. పది లక్షల మేర ప్రజలను ముంచాడు. పెద్దూరుకు చెందిన కొణిజేటి శ్రీనివాసులు బుచ్చి బస్టాండ్‌లో సాయిశ్రీయ శారీస్,

బుచ్చిలో మహా మాయగాళ్లు

మ్యాచింగ్ బ్లౌజింగ్ షాపును నిర్వహిస్తుండే వారు. ఇతను నెల్లూరు, కావలి వస్త్ర వ్యాపారులతో పాటు స్థానికుల వద్ద సర్దుబాటు పేర పది లక్షలు అప్పు చేశాడు. అందరూ ఒకేసారి కట్టమని ఒత్తిడి చేయడంతో చేతులెత్తేశాడు. తన దగ్గర వున్నది

కొరవ 8వ పేజీలో

కుల్లూరులో ఆకతాయిలు

చదువుకోను కాలేజీలకు వెళ్లే అమ్మాయిలకు పట్టణాల్లోనే కాదు పల్లెల్లోనూ ఆకతాయిల బెడద తప్పడం లేదు. రాపూరు, కలువాయి మండలాలకు చెందిన పేద, మధ్యతరగతీయులు తమ పిల్లలను కుగ్రామమైన కుల్లూరులోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేర్పించారు. పల్లెల నుంచి విద్యార్థినులు కాలేజీకి రోజూ బస్సుల్లో వచ్చి వెళ్తుంటారు. కుల్లూరు బస్టాండ్‌లో పనీ బాట లేక పచార్లు కొట్టే కొందరు జులాయిలు బస్సు దిగి వెళ్తుండే అమ్మాయిల వెంటపడి గొడవ చేస్తున్నారు. ఈ విషయం పెద్దలకు చెబితే కాలేజి మానిపిస్తారన్న భయంతో విద్యార్థినులు తమలో తాము కుంగి పోతున్నారు. కాలేజి నిర్వాహకులకు విషయం చెప్పినా వారు బస్సు దిగి దించిన తల ఎత్తకుండా కాలేజీకి రమ్మంటున్నారే తప్ప పోలీసుల దృష్టికి తీసుకెళ్లడం లేదు. గత ఏడాది ఈ కాలేజీలో 100 మంది విద్యార్థులుండేవారు. ఈ యేడాది 150 మంది అయ్యారు. టీజింగ్ వ్యవహారమై పోలీస్‌స్టేషన్ వరకు వెళ్తే అనవసర రచ్చ జరుగుతుందని ఊరుకొంటున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కలువాయి ఎస్ఐ వారం రోజుల పాటు మఫ్టీలో పోలీ

కొరవ 8వ పేజీలో

తాగించలేను! నన్ను వదిలెయ్యండి

మద్యాన్ని అధిక మొత్తంలో అమ్మించి సర్కారు ఆదాయాన్ని పెంచాలని టార్గెట్లు విధించడంతో ఈ ఒత్తిడి భరించ లేక ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లు కొందరు దీర్ఘకాలిక సెలవు పెట్టగా, కావలి ఇఎస్ వుద్యోగానికి రాజీనామా చేయడం చర్చనీయాంశమయ్యింది. జిల్లా మొత్తానికి కలిపి గతంలో ఒక్కరే ఇఎస్‌గా వుండేవారు. ఈ యేడాది నూతన ఎక్సైజ్ పాలసీ రావడంతో నెల్లూరులో నారాయణరెడ్డి, కావలిలో శ్రీధర్‌రెడ్డిలను ప్రభుత్వం ఇఎస్‌లుగా నియమించింది. ఒక్కొక్క డివిజన్‌లో నెలకు పది నుంచి 12 కోట్ల రూపాయల వరకు మద్యం అమ్మించాలని అధికారులు టార్గెట్ పెట్టారు. దీనిమూలంగా 24 గంటలు బ్రాందీషాపులు, బార్లు తెరిచి వుంచినా అడిగేవాళ్లు లేకుండా పోయారు. గ్రామాల్లో బెల్టుషాపుల మూలంగా నానా గందరగోళాలు జరుగుతున్నా పట్టించుకోవడం మానేశారు. కావలి డివిజన్ ఇఎస్ శ్రీధర్‌రెడ్డి ఎంటెక్ చదివారు. లంచ గొండి కాకపోవడంతో అధికారుల ఒత్తిడి తట్టుకోలేక ఎక్సైజ్ కమిషనర్‌కు తన రాజీనామా పంపారు. అధికారులు దీన్ని ఆమోదించక ప్రక్కన పెట్టి విధుల్లో చేరమని ఒత్తిడి పెంచారు. అయితే శ్రీధర్‌రెడ్డి మాత్రం విదేశాల్లో వున్న మిత్రులు వుద్యోగం చూసి పెడతాము రమ్మనడంతో అన్నీ సర్దుకొని రెడీగా వున్నారు. ఆదాయం కోసం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు ప్రజలను మత్తులో ముంచెత్తి లాభపడచూడడం కన్నా దారుణం ఇంకొకటి వుందా?

జడ్పీ సమావేశానికి రామనారాయణ దర్శకత్వం!

24తేది జరిగిన జడ్పీ మొట్ట మొదటి సర్వసభ్య సమావేశాన్ని రాపూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి దర్శకత్వంలో,

ఎక్సైజ్ అధికారి రాజీనామా

ఛేర్మన్ కాకాణి గోవర్ధనరెడ్డి విజయవంతమయ్యేలా చేశారు. అజెండాలో 28 అంశాలతో పాటు అత్యంత కీలకమైన 100 కోట్ల రూపాయల బడ్జెట్‌ను సభ్యులు చర్చ లేకుండా ఆమోదింప జేయడంలో ఛేర్మన్ కృతకృత్యులయ్యారు. సమావేశాన్ని ఛేర్మన్ స్పీడుగా నడిపించారు. తొలి సమావేశం కావడంతో కొత్త సభ్యులు మాట్లాడను సందేహించారు. మాట్లాడబోయిన వారిని రామనారాయణరెడ్డి రూల్స్, రెగ్యులేషన్ తెలుసుకొని మాట్లాడమని నిలువరించే ప్రయత్నం చేశారు. ఈ వ్యవహారమై బుచ్చి జడ్పీటీసి ఎర్రంరెడ్డి గోవర్ధనరెడ్డి, రామనారాయణరెడ్డిలకు తీవ్ర స్థాయిలో వాగ్వివాదం జరిగి సమావేశం ముగిసే సమయంలో చర్చ రంజుగా మారింది. సమావేశం ప్రారంభం కాగానే జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయబోతున్న ఆర్థిక మండళ్లపై చర్చించను వింజమూరు జడ్పీటీసి నారపరెడ్డి, జడ్పీ ఛేర్మన్‌ను అవకాశమడిగారు. అజెండా అయ్యాక ఇస్తానన్న ఛేర్మన్ చివరన ఆయనకు అవకాశమిచ్చారు. ఈ దశలో రామనారాయణరెడ్డి బోక్యం చేసుకొని ప్రత్యేక ఆర్థిక మండళ్లపై చర్చించను జడ్పీ సమావేశానికి అధికారం వుందో లేదో పరిశీలించమని, ఛేర్మన్‌కు సూచించారు. ఆయన ఉపన్యాసాన్ని కొనసాగిస్తూ కలెక్టర్, మంత్రి, ఎమ్మెల్యేలు కలిసి మేనకూరు, కృష్ణాపట్నం ఆర్థిక మండళ్లలో భూముల రేట్లు నిర్ణయించారని, ఇక్కడ ప్రభుత్వం ప్రకటించిన రేటు తీసుకోను రైతులకు అభ్యంతరం లేదన్నారు. వింజమూరు జడ్పీటీసి నారపరెడ్డి లేచి కృష్ణాపట్నంలో ఎకరాకు 12 లక్షలు, మేనకూరులో నాలుగు లక్షలు రైతులకు పరిహారంగా ఇవ్వాలన్నారు. ఈ దశలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం జోక్యం చేసుకొంటూ మేనకూరులో టెక్స్‌టైల్ పార్కు కోసం ఎంపిక చేసిన స్థలాలకు పెద్ద విలువ

కొరవ 8వ పేజీలో

అయ్యోర్ల కుమ్ములాట

పాత రోజుల్లో సమాజంలో ఉపాధ్యాయులకు ఎంతో గౌరవ స్థానముండేది. కాని ఈ మధ్య ఉపాధ్యాయులు మిగతా వాళ్ల మాదిరి దిగజారి పోయారు. సకల అవలక్షణాలను వంట బట్టించుకొన్నారు. 28తేది బుచ్చి మండలం మినగల్లు పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడొకరు గ్రామస్తులు చూస్తుండగా హెడ్‌మాస్టర్‌తో కలియబడిన సంఘటన వీరి పరువు బజారు పాలయ్యేలా చేసింది. గత కొంతకాలంగా మినగల్లు ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల మధ్య మనస్పర్థలు చోటు చేసుకొన్నాయి. దీన్ని ఆసరాగా చేసుకొని నాగేశ్వరరావు అనే ఉపాధ్యాయుడు ఆరవ తరగతి పిల్లలకు ఇంగ్లీషు చెప్పడం మానేశాడు. ఈ విషయమై స్థానికులు ఉపాధ్యాయుడ్ని ప్రశ్నించగా ఒక ఉపాధ్యాయుడు వారానికి 24 పీరియడ్స్ మాత్రమే తీసుకోగలడని సర్క్యులర్ చూపించాడు. దీంతో గ్రామస్తులకు మండింది. మంగళవారం హెడ్‌మాస్టర్ దగ్గరకు వచ్చి ఇంగ్లీషు పాఠాలు చెప్పని విషయమై నిలదీయగా, దీనికి నాగేశ్వరరావు కారణమని ఆయన చెప్పారు. దీంతో రెచ్చిపోయి ఉపాధ్యాయుడు హెడ్‌మాస్టర్‌పై పడి

కొరవ 7వ పేజీలో



సాయ్రూట్ క్లినిక్ & టెస్ట్ ట్యూబ్ బేబి సెంటర్

ఆర్టీసి బస్టాండ్ ప్రక్కన, శోధన్ నగర్, నెల్లూరు. ఫోన్ : 0861 - 2301980, 9346636434



డా॥ సుధాకర్ గారితో లక్ష్మీనారాయణరెడ్డి - సులోచన

మాకు వివాహమై 6 సం॥లు అయినా సంతానం కలుగలేదు. నెల్లూరులోని **సాయ్రూట్ క్లినిక్ & టెస్ట్‌ట్యూబ్ బేబి సెంటర్**లో చికిత్స చేయించుకొన్న అనంతరం తక్కువ ఖర్చుతో పండంటి బాబు పుట్టాడు. మాకు సంతాన భాగ్యం కల్పించిన **డా॥ సుధాకర్, డా॥ విజయలక్ష్మి** గార్లకు హాస్పిటల్ 10వ వార్షికోత్సవం సందర్భంగా మా హృదయ పూర్వక శుభాకాంక్షలు.



డా॥ M.సుధాకర్
M.B.B.S., M.S., (Gen.Russia) FCCP

ఉచిత వైద్య శిబిరం

వార్షికోత్సవం సందర్భంగా డిసెంబర్ 7, 8 తేదీలలో సంతానం లేని దంపతులను ఉచితంగా చూడబడును. ఈ అవకాశం వినియోగించుకోవల్సినది.

లక్ష్మీనారాయణరెడ్డి - సులోచన
తాడిపత్రి, అనంతపురం జిల్లా.

10వ వార్షికోత్సవ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం

నెల్లూరు పబ్లిక్స్ విక్షకుడు

సిఐ తిరుపాలుపై కేసు నమోదు

అవినీతి ఆరోపణలతో సస్పెండ్ అయినా బాలాజీనగర్ మాజీ సిఐ తిరుపాలులో దూకుడు ఇంకా తగ్గలేదు. 30తేది బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి మాజీ కౌన్సిలర్ కిన్నెర కృష్ణమూర్తి ఇంటి ధ్వంసం కేసు ఫైల్ పట్టుకెళ్లబోతుండిన ఆయనకు ఎస్‌ఐ విజయకృష్ణ అడ్డు పడ్డాడు. దీనికి ఆగ్రహించిన తిరుపాలు, ఎస్‌ఐపై చేయి చేసుకోవడంతో ఆయనా తిరగబడక తప్పలేదు. ఈ విషయం తెలుసుకొన్న ఎస్పీ లక్ష్మీరెడ్డి, తిరుపాలుపై బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌లోనే కేసు నమోదు చేయించారు. ఎస్‌ఐగా తన కెరీర్ మొదలెట్టిన తిరుపాలు ఇప్పటికే లెక్కలేనన్ని సార్లు సస్పెండ్ అయినా ఇసుమంత కూడా మారలేదు.

ఆగని సింగిల్ నెంబర్లాట బెట్టింగ్‌లు

నెల్లూరు నగరంలో సింగిల్ నెంబర్లాట, బెట్టింగ్‌లు చాపక్రింద నీరులా సాగిపోతున్నాయి. వన్, టూ, త్రీ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ ఆటల జోరెక్కువుంది. నిర్వాహకులకు పోలీసులు సహకరించబట్టే ఎంత తక్కువ అనుకొన్నా నగరంలో రోజూ 10 లక్షల రూపాయల మేర సింగిల్ నెంబర్లాట, అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌ల సందర్భంగా పెద్ద మొత్తాలు బెట్టింగ్ కాస్తున్నారు. సింగిల్ నెంబర్లాట చిన్నబజారు, కోటమిట్ట, మూలాపేట, బెండావీధి, మైపాడుగేటు ప్రాంతాల్లో ఫుంజుతంగా ఆడుతున్నారు. కార్పొరేటర్లు దువ్వూరు శరత్‌చంద్ర, రూప్‌కుమార్‌లకు ఈ ఆటలే జీవనాధారం. కాంగ్రెస్, తెలుగుదేశం, బిజెపి నాయకులు చాలామంది బెట్టింగ్‌ల్లో బిజీగా వుంటారు. శరత్‌చంద్రపై ఎవరో కొత్త ఎస్పీ లక్ష్మీరెడ్డికి ఫోన్‌చేసి చెప్పడంతో ఆయన 27తేది అదుపులో తీసుకొన్నారు. శరత్‌చంద్రను పాత ఎస్పీలు శ్రీనివాసరెడ్డి, రాజేంద్రనాథ్‌రెడ్డి అదుపులో పెట్టారు. శివధర్‌రెడ్డి, సూర్యనారాయణ హయాంలో పోలీసులతో కుమ్మక్కయ్యి ఈ దొంగాటను ఆయన కొనసాగిస్తున్నారు.

కొత్త ఎస్పీ లక్ష్మీరెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సింగిల్ నెంబర్లాట, క్రికెట్ బెట్టింగ్‌ల నిర్వాహకుల పనిబడితే ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపిన వారవుతారు.

కార్పొరేటర్ స్వర్ణా వెంకయ్యపై కేసు

నెల్లూరు కార్పొరేషన్‌లో 30వ డివిజన్ కార్పొరేటర్ స్వర్ణా వెంకయ్యపై కోవూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. మద్యం మత్తులో ఓ వ్యక్తిపై దాడిచేసి గాయపర్చారాయన. సర్వేపల్లి శాసనసభ్యుడు ఆదాల ప్రభాకరరెడ్డి పేరు చెప్పి బెదిరిస్తుండడంతో వెంకయ్య అరెస్ట్‌కు పోలీసులు వెనుకా ముందు ఆలోచిస్తున్నారు.

పోలీసు అధికారుల కొరత

నెల్లూరు నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో సిఐ, ఎస్‌ఐల పోస్టులు ఖాళీగా వుండడంతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుంది. అవినీతి ఆరోపణల వల్ల నగర డిఎస్పీ కన్నాజీరావు, బాలాజీనగర్ సిఐ తిరుపాలు, ఎస్‌ఐ చెంచురామయ్య, త్రీటౌన్ ఎస్‌ఐ సుబహాన్ సస్పెండ్ అయ్యారు. నగరంలో అత్యంత ప్రాధాన్యత గల ఫోర్ట్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో చాలా రోజులుగా ఎస్‌ఐ లేరు. క్రైం ఎస్‌ఐ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. కోవూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్‌ను అవినీతి నిరోధక శాఖాధికారులు పట్టుకోవడంతో ఆ పోస్టు ఖాళీగా వుంది. ఈ పోస్టుల భర్తీకి ఎస్పీ తక్షణ చర్యలు తీసుకోవాల్సి వుంది.

సింగిల్ నెంబర్లాట నిర్వాహకుల అరెస్ట్

నెల్లూరు నగరంలో గత నాలుగు రోజులుగా సింగిల్ నెంబర్లాట నిర్వహించే 60 మందిని పోలీసులు అదుపులో తీసుకొన్నారు. వీరిని కోర్టుకు హాజరు పర్చగా న్యాయమూర్తి 15 రోజుల పాటు రిమాండ్‌కు పంపారు. పోలీసులు సింగిల్ నెంబర్లాట నిర్వాహకులపై ఇదేవిధంగా దాడులు కొనసాగిస్తే ఈ ఆట నగరంలో అంతర్ధానమవుతుంది.

బెజవాడ రామచంద్రారెడ్డి జయంతి సభ

జస్టిస్ పార్టీ నాయకులు, పార్లమెంటేరియన్ బెజవాడ రామచంద్రారెడ్డి 112 జయంతి వేడుకలు టౌన్‌హాల్‌లో ఘనంగా జరిగాయి. బిజెపి జాతీయ నాయకుడు ఎం.వెంకయ్య నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. రాజకీయాల్లో నైతిక విలువలకు రామచంద్రారెడ్డి నిలువుటద్దమన్నారు. బెజవాడ ఓబులరెడ్డి మాట్లాడుతూ తమ తండ్రికి సాహిత్యం, రైతులంటే ఎంతో ఇష్టమన్నారు. జిల్లా జడ్జి ఎన్.ఆర్. ఎల్.నాగేశ్వరరావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి 110 పద్యాలతో రచించిన మాతృశతకం, దోనిపర్తి రమణయ్య రచించిన శ్రీదుర్గా భైరవ క్షేత్ర మహత్మ్య కావ్యాలను వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. వివి నరసింహం వందన సమర్పణ చేశారు.

శశాంక్ అభినందన సభ

కీబోర్డును అత్యద్భుతంగా వాయించి రాష్ట్ర ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా బాలల దినోత్సవం రోజు బాల రత్న అవార్డు అందుకొన్న నెల్లూరు హరనాథపురం రత్నం హైస్కూల్ విద్యార్థి శశాంక్‌కు అభినందన సభ 26తేది టౌన్‌హాల్‌లో జరిగింది. సింహపురి సంగీత సభ నేతృత్వంలో రత్నం విద్యాసంస్థల సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో శశాంక్, కీబోర్డుపై శాస్త్రీయ సంగీత కచ్చేరి చేసి సభికుల మన్ననలు పొందాడు. నెల్లూరు ఎమ్మెల్యే వివేకానందరెడ్డి, మేయర్ పులిమి శైలజ, డిఇఓ భార్గవ్, కార్పొరేటర్ భానుశ్రీ – శశాంక్ భవిష్యత్తులో మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు. శశాంక్‌ను మెమెంటో, దుశ్శాలువాలతో సత్కరించారు. శశాంక్ గురువు విజయ సారథిని సైతం సింహపురి సంగీత సభ నిర్వాహకులు వుచిత రీతిన సన్మానించారు.

భగవద్గీత కంఠస్త పోటీలు

విశ్వ హిందూ పరిషత్ నెల్లూరు శాఖ 26తేది గుండా ఆంజనేయులు కళ్యాణ మండపంలో విద్యార్థినీ, విద్యార్థులకు భగవద్గీత కంఠస్త పోటీలు పెట్టింది. సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో సిహెచ్ ఉషారాణి, డివి పద్మలత, శ్రావణ సంధ్య, మోహన్‌రావు, ఉమా శ్రీదేవి, సిహెచ్ మేఘన, కీర్తన భరద్వాజ, కిళాంభి రాధ, వెంకట హారిక, మేఘన, సాయికృష్ణ మనోజ్, ఐశ్వర్య విజేతలుగా నిలిచారు. వీరికి విశ్వ హిందూ పరిషత్ నాయకుడు బయ్యా శ్రీనివాసులు గుప్త బహుమతులు పంచారు.

ఎయిడ్స్ వ్యతిరేక ప్రచారం

స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా నెల్లూరు నగరంలో ఎయిడ్స్ వ్యతిరేక ప్రచారం ప్రారంభించింది. ఎయిడ్స్ నిర్మూలనకు ఇస్లామియా జీవన విధానాన్ని పాటించాలని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జిల్లా ఆర్గనైజర్ సయ్యద్ నవీద్ పిలుపునిచ్చారు. ఖురాన్‌లో వ్యభిచారం దరిదాపుల్లో పోవద్దని చెప్పి వున్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి రోజూ ప్రపంచ వ్యాప్తంగా 12వేల మంది ఎయిడ్స్ వ్యాధి బారిన పడుతున్నారని, నెల్లూరు జిల్లా రాష్ట్రంలో వ్యాధి తీవ్రతలో రెండవ స్థానంలో వుండడం పట్ల ఆందోళనను వ్యక్తం చేశారు. విద్యార్థులు, స్త్రీలను

ఈ వారం "గరం గరం"

* వివేకా చేయి పడితే ఏ ఫైల్ అయినా పనిచేస్తుంది.

– మేనకూరు హెలిప్యాడ్ వద్ద జరిగిన ప్రెస్‌మీట్‌లో వివేకాను మెచ్చుకొన్న సిఎం.

(నిజమే! ఆయన చెయ్యి పడితే కొంతమందికి జీవముంటే కొంతమంది బేకలిస్తారు. ఇక ఫైలు ఎంత?)

* సోనియాగాంధీ మాట తెలిస్తే తప్పరు.

– మేనకూరులో సొక్కివక్కాణించిన ముఖ్యమంత్రి.

(నిజమే, తమరిని ముఖ్యమంత్రి చేసిందిగా?)

* సర్వేపల్లిని ఆదర్శ నియోజక వర్గం చేస్తా!

– ఇందుకూరుపేట మండల సభలో ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆశాభావం.

(ఆదర్శం అంటే ప్రజలకు మీ దర్శనం లేకుండా చేయడమా?)

* నెల్లూరులో రోజురు సరాసరిన పందమందిని కరుస్తున్న కుక్కలు.

– వాస్తవం ఒప్పుకొన్న పశు సంవర్ధక శాఖాధికారులు.

(కార్పొరేషన్‌లో రాజకీయ కుక్కల కొట్లాటలో వీధి కుక్కలను పట్టించుకునే వారెవరు?)

* ఈవ్‌టీజర్లను కొట్టండి, కేసులుండవ్!

– నెల్లూరు మహిళలకు ఎస్పీ లక్ష్మీరెడ్డి భరోసా.

(మామూళ్లు, లంచాలు గుంజే పోలీసులకూ అదే శిక్ష అమలు చేస్తే?)

* పోలీసుల్లో ఏ స్థాయి అధికారులైనా అవినీతి, సివిల్ పంచాయతీలు చేస్తే కఠిన చర్యలు.

– నెల్లూరులో నిష్కారంగా మాట్లాడిన గుంటూరు రేంజి ఐజి సత్యనారాయణన్.

(అలాగైతే పోలీసులే మిగలరేమో?)

* చాలామంది రాజకీయాలంటేనే ఈసడించుకొంటున్నారు.

– నెల్లూరులో చేదు నిజం చెప్పిన లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి డివిఎస్ వర్మ.

(ఆ ముద్దలోకి తమరెందుకు దిగినట్టో!)

* ఎస్.ఇ.జడ్.లు అభివృద్ధిపై నేదురుమల్లితో చర్చకు సిద్ధం.

– నెల్లూరులో చంద్రమోహన్‌రెడ్డి సవాల్.

(పిట్ట కొంచెం కూత ఘనం అంటే ఇదే కదా?)

ఊబకాయం వ్యతిరేక ర్యాలీ

ప్రపంచ ఊబకాయం వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని నెల్లూరులోని ఒబేసిటీ క్లినిక్ – 2000 నిర్వాహకులు 26తేది నగరంలో ర్యాలీ నిర్వహించారు. గాంధీబొమ్మ నుంచి మద్రాస్ బస్టాండ్ వరకు కొనసాగిన ఈ ర్యాలీ విఆర్ కాలేజి మైదానానికి చేరుకొంది. ర్యాలీలో ఎసి స్టేడియం, విఆర్ కాలేజి, సింహపురి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. డాక్టర్ ఎం.పెంచలరెడ్డి ఊబకాయం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సభికులకు వివరించారు.

పోలీసాఫీసును పరిశీలించిన ఐజి

గుంటూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సత్యనారాయణ్ 26తేది నెల్లూరు పోలీసు కార్యాలయాన్ని, సాయుధ దళ పోలీసుల పనితీరును పరిశీలించారు. ఏడాదికొకసారి నిర్వహించే తనిఖీలో భాగంగా ఆయన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా సాయుధ దళ పోలీసుల పెరేడ్‌ను నిర్వహించి ఐజి సత్యనారాయణ్‌కు గౌరవ వందనం, అనంతరం కవాతు చేశారు. ఆర్ఐ అంజిరెడ్డి వీటికి కమాండెంట్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా మంటల్లో చిక్కుకొన్న గుడిసెవాసులను ఏ విధంగా రక్షించాలనే విషయాన్ని విన్యాసాల రూపంలో పోలీసులు ప్రదర్శించారు. ఎకె 47, సెల్ఫ్ లోడింగ్ రైఫిల్‌లో భాగాలను వేరుచేసి వాటిని తిరిగి యథాతథంగా పోలీసులు అమర్చడాన్ని ఆయన పరిశీలించారు. తర్వాత జిల్లా పోలీసు కార్యాలయం పనితీరును, రికార్డులను తనిఖీ చేశారు. స్టోర్‌రూం, డిసిఆర్‌బి, హోంగార్డ్స్, ఎఆర్ డిఎస్పీ కార్యాలయాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలను ఐజి సత్యనారాయణ్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.లక్ష్మీరెడ్డి, అదనపు ఎస్పీ జె.కనకారావు, డిఎస్పీలు సాంబశివరావు, కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

డాక్టర్ మన్నెం కృష్ణారెడ్డి మరణం

జిల్లాలో డాక్టర్‌గా బహుముఖీయమైన సేవలు చేసిన డాక్టర్ మన్నెం వెంకటకృష్ణారెడ్డి పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో 28తేది ప్రశాంతంగా కన్నుమూశారు. ప్రాథమిక విద్యను విఆర్ హైస్కూల్‌లో చదివిన కృష్ణారెడ్డి, 1940లో ఎంబిబిఎస్‌ను పూర్తి చేసి 1950లో పెద్దాస్పత్రిలో గౌరవ సివిల్ సర్జన్‌గా చేరి 1965 వరకు పనిచేశారు. 1958లో శాసనమండలికి ఎన్నికయ్యారు. 1975 ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేసిన డాక్టర్ 1982 నుంచి పుట్టపర్తిలోని ప్రశాంతి ఆస్పత్రిలో 2002 వరకు సేవలందించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. వారి కుటుంబానికి మా సానుభూతి.

11వ వర్ధంతి



మంచి మనిషి,
మాకు అత్యంత ఆప్తులు, ప్రముఖ
పారిశ్రామికవేత్త అయిన
కీ॥శే॥ **మాగుంట**
సుబ్బరామిరెడ్డి గారి
పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ...
వారి కుటుంబానికి మా ప్రగాఢ
సంతాపం తెలియజేస్తూ...

కీ॥శే॥ మాగుంట సుబ్బరామిరెడ్డి గారి

అరుణ గ్రాఫిక్స్
రాయాజీవీధి, నెల్లూరు. ఫోన్ : 2325526

సస్పెన్షన్లు

2వ పేజీ కొరవ

వాడిన పొలైయిస్ కానీ, లారీ కానీ స్వాధీనం చేసుకోలేదు. బలవంతంగా ఎత్తుకపోయిన కిన్నెర కృష్ణమూర్తి ఇంటిలోని సామాను ఎక్కడ దాచారో వెలికి తీయలేదు. దర్యాప్తు అధికారిని మార్చి, నగర సివి రాంబాబును నియమించిన తర్వాత కూడా అదే పరిస్థితి. ఆ రౌడీల జోలికి వెళ్తే సహించేది లేదని స్థానిక ఎమ్మెల్యే గట్టిగా బెదరించడంతో స్థానిక పోలీసులు చేష్టలుడిగి పోయి వున్నారు.

తమ శాఖ పరువును పెన్నులో కడిగిన ఈ దుర్మార్గంపై కొత్త ఎస్పీ గారైనా కొంత కఠినంగా వ్యవహరిస్తే, నెల్లూరీయులు సంతోషిస్తారు. డిఎస్పీ స్థాయి అధికారి సస్పెన్షన్‌కు కారకులైన దోషులను ఇప్పుడైనా శిక్షించడం పోలీసు బాధ్యత.

కుటుంబ చేటు

మొదటి పేజీ కొరవ

5 శాతం రిజర్వేషన్ హామీ గుప్పిస్తున్నారు. సంచార్ కమిటీ నివేదిక ఆధారంగా ముస్లింలకు అన్నిటిలో ప్రాధాన్యత ఇస్తామని నమ్మబలుకుతున్నారు. ముస్లిం ఓటర్లు ఎక్కువగా వుండే ప్రాంతాలలో ఓటుకు వెయ్యి రూపాయల వరకు ఇవ్వడానికి సిద్ధ పడుతున్నారు. పోలింగ్ నాటికి పరిస్థితిని తమకు అనుకూలం చేసుకోవడానికి పెద్ద ఎత్తున డబ్బు క్రుమ్మరించడం ఒక్కటే మార్గమని ప్రచారంలో నిమగ్నమై వున్న అందరు మంత్రులు, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రితో నివేదిస్తున్నారు. వారడిగే స్థాయిలో డబ్బు సరఫరా చేయాలంటే, వంద కోట్ల రూపాయలకు పైగా ధార పోయవలసి వస్తుంది.

అయితే, ఈ ప్రయత్నాలు ఫలిస్తాయన్న విశ్వాసం కాంగ్రెస్ ప్రచారకులలో కూడా పెద్దగా కన్పించడం లేదు. చంద్రబాబు రోడ్డు షోలకు జనం విరగబడి రావడం వారిని కలవర పరుస్తున్నది. తెలుగుదేశం పార్టీ తమకంటే ముందు మిగిలిపోతున్నదని ఆందోళన పడుతున్నారా యన. ప్రత్యేక తెలంగాణా కోరిక పుష్కలంగా వున్న యువకులు టీఆర్ఎస్ వైపు వెళ్తుంటే, వెనుకబడిన తరగతుల వారు టిడిపి పక్క నిలబడుతున్నారు. యువత రంలో, వుద్యోగ వర్గాలలో తెలంగాణా సెంటిమెంటు ప్రగాఢంగా కనపడుతున్నది. కెసిఆర్ అంటే గిట్టని వర్గాలు కూడా, ఇప్పుడాయన ఓడితే తెలంగాణా వుద్యమం శాశ్వతంగా చప్పబడి పోతుందనే భయంతో టిఆర్ఎస్‌కు మద్దతిస్తున్నారు.

ఇదిట్లా వుంటే, బొగ్గిలోను కాంగ్రెస్‌కు ఎదురీత తప్పదం లేదు. అక్కడ కరెంటు సమస్య కాటు వేస్తుంటే, ఇక్కడ బొత్సా సత్యనారాయణ కుటుంబ పాలన చేటు చేస్తున్నది. రాజశేఖరరెడ్డితో తనకున్న సాన్నిహిత్యాన్ని ఆ జిల్లాలో తన రాజకీయ ప్రాభవం పెంపుదలకు వాడుకున్నాడు సత్తిబాబు. జిల్లాలో ఏ పదవి వచ్చినా, కాంట్రాక్టు పని అవకాశం ఏర్పడినా తన కుటుంబానికే దక్కించుకొంటున్నారాయన. ఆయన పైనా, ఆయన కుటుంబ సభ్యుల పైనా అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈనాడు దిన పత్రిక వెంటాడుతున్నది. ప్రచారం మొదలైన నాటి నుంచి ప్రతి రోజు ఏదో ఒక అవినీతి కథ బయటకు తెచ్చి, ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. మరొక ప్రక్క ఈ సమస్యలోనే వోక్స్‌వ్యాగన్ పరిశ్రమ విశాఖపట్నం నుంచి తరలి పోవడం; దానికి సత్తిబాబుదే బాధ్యత అన్న నింద పైన పడడం; అణు విద్యుత్ కేంద్రం సమస్య జనాన్ని కలవర పరుస్తుండడంతో కాంగ్రెస్ విజయావకాశాలు క్షీణించి పోతున్నాయి. కరీంనగర్ అంత ప్రమాదం కాకపోయినా, గెలుస్తామని ధైర్యంగా చెప్పే పరిస్థితి లేకుండా పోతున్నది.

అధిష్టాన వర్గ ప్రతినిధి దిగ్విజయ్ సింగ్‌కు ఈ నిజం బాగా అర్థమైంది. ప్రచారం కోసం వచ్చిన ఆయన దిగువ స్థాయి కార్యకర్తలతో కూడా మాట్లాడి, పరిస్థితి అంచనా వేసి, విజయావకాశాలపై పెదవి విరిచేశాడు. ఢిల్లీ పెద్దలకు కూడా అదే చెప్పారట ఆయన.

కరీంనగర్, బొగ్గిలి స్థానాలు రెండూ గెలిస్తే ముఖ్యమంత్రి రాజకీయ ప్రాభవం ఎంత గొప్పగా పెరిగి పోతుందో; ఇవి రెండూ ఓడితే అంతే స్థాయిలో సమస్యలు చుట్టుముడుతాయన్నది వాస్తవం. ఇంటా బయటా విమర్శలు వెల్లువెత్తుతాయి. పార్టీ మీద పట్టు తప్పే ప్రమాదం వుంది. అసమ్మతి చెలరేగి పోతుంది. అధిష్టానం కూడా అనుమానంగా చూస్తుంది. చంద్రబాబు రెచ్చిపోతాడు. ఆయన మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశం వుంది అన్పిస్తే, అధికారులలో సగం మంది ఇప్పటి నుంచే జాగ్రత్త పడి పోతారు. ఈ సమస్యలేవీ నెత్తిన పడకుండా వుండాలంటే, ఈ రెండు స్థానాలలో గెలిచి తీరాలి. అందుకు ఏ మంత్ర విద్య అవసరమో మాత్రం ముఖ్యమంత్రికి అర్థం కావడం లేదు.

రేచల్ ఛటర్జీ

12వ పేజీ కొరవ

లెక్కలు నిజమైతే, ఏ గ్రామానికి వెళ్లినా కరెంటు సమస్య అంత వుధృతంగా విన్పించేది కాదని; ఆమె లెక్కలకు, వాస్తవ పరిస్థితికి మధ్య తేడా వుండబట్టే కాంగ్రెస్ పట్ల రైతులలో వ్యతిరేకత పెల్లుబుకుతున్నదని ముఖ్యమంత్రికి నచ్చ చెప్పడంలో విజయం సాధించాడు షబ్బీర్ ఆలి. అందువల్లనే విద్యుత్ సరఫరా మీద ఈ వారంలో రెండు సార్లు సమీక్ష నిర్వహించాడు. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి మరీ అవమానకరంగా వుంటే మాత్రం రేచల్ ఛటర్జీని బలి పశువుగా మార్చే అవకాశం కన్పిస్తున్నది. ఆ నింద ఆమె మీద వేసేందుకు ఇప్పటి నుంచే రంగం సిద్ధం చేస్తున్నాడు విద్యుత్ మంత్రి.

పాలాల కొనుగోళ్లు

2వ పేజీ కొరవ

రావాలని ఈ వేదిక మీద నుంచే ఆహ్వానం అందించారు.

ముఖ్యమంత్రి ప్రసంగం వుద్యోగ భరితంగా సాగింది. ఎన్నో ఏళ్ల నుంచి పరిశ్రమల కోసం, ఉపాధి అవకాశాల



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న చదువుల మంత్రి రాజ్యలక్ష్మమ్మ వేదికపై కలెక్టర్ రవిచంద్ర, జడ్పీ ఛైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, సిఇఓ పెంచలరెడ్డి వున్నారు.

కోసం ఈ ప్రాంతం వారు కన్న కలలన్నీ నెరవేరే రోజు వచ్చిందని; తెలుగుదేశం ప్రభుత్వం వున్న పరిశ్రమలు మూసి పారేస్తే, తాను కొత్తవి తెస్తున్నానని గర్వంగా చెప్పుకున్నారాయన.

ముఖ్యమంత్రి సభ కాబట్టి, వర్గ రాజకీయాలు పక్కన పెట్టి జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ హాజరైనారు.

కుమ్ములాట

5వ పేజీ కొరవ

కొట్టాడు. చివరికి వీరిని గ్రామస్తులే విడదీయాల్సి వచ్చింది. ఈ వ్యవహారమై డిఇఓ విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని భవిష్యత్తులో జిల్లాలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సి వుంది.

ఖైదీల వేట

నెల్లూరు సెంట్రల్ జైలులో శిక్షనుభవిస్తూ పారిపోయిన ఖైదీల కోసం పోలీసులు గత పది రోజులుగా అన్వేషిస్తున్నా ఫలితం కానరాలేదు. కాళహస్తికి చెందిన వెంకయ్య జీవిత ఖైదు శిక్షనను భవిస్తూ చెముడుగుంటలోని ఓపెన్ జైలు వద్ద పనిచేస్తూ తప్పించుక వెళ్లాడు. ఈ సంఘటన జరిగిన మరుసటి రోజే పెద్దాస్పత్రి నుంచి ఓ హత్య కేసులో శిక్షను భవిస్తుండిన మంజునాథ్ కూడా పారిపోయాడు. మంజునాథ్ కోసం పోలీసులు గత వారం రోజులుగా అనంతపురం, బెంగుళూరు ప్రాంతాల్లో గాలిస్తున్నారు. ఖైదీలు పారిపోయిన సమయంలో వీరికి సెక్యూరిటీ గార్డులుగా వున్న పోలీసులు దీర్ఘ నిద్రలో వున్నట్లు విచారణలో తేలింది. పారిపోయిన వారిని పక్షం రోజుల్లో పట్టుకాకుంటే సస్పెండ్ చేస్తామని ఉన్నతాధికారులు తాఖీదు ఇవ్వడంతో సెక్యూరిటీగా వున్న పోలీసులు స్వంత డబ్బులు పెట్టుకొని ఖైదీల కోసం గట్టిగా గాలిస్తున్నారు.

NOTICE

In The Court of the Chief Judge, City Civil Court at Hyderabad

O.S.No.93/ 2004

Between

1) M/s Biogenus India Limited with its Registered Office at Jubilee Hills, Hyderabad and 4 others ... Plaintiffs

And

1) K. Sridhar Reddy and 3 others ... Defendants

To. Dr. Vemireddy Dasaratha Rama Reddy
R/o H.No.23-1409, CAM Compound, Nellore

My Client M/s. Biogenus India Limited and its Directors have filed the Suit against the defendants to declare the Resolution dated 7.3.2003 as bad in law and whereas the defendant No.4 Dr. Vemireddy Dasaratha Rama Reddy notice is not served. Therefore, a substitute service is ordered on 1.11.2006 directing the case to be posted on 14.12.2006.

Accordingly, you are, required to attend on that day, failing which, the matter will be decided on the basis of the records available.

D.GOVERDHANA CHARY
Counsel for Plaintiff



ప్రపంచ ఎయిడ్స్ దినము 1 డిసెంబరు, 2006

"ఎయిడ్స్‌ను అరికడదాం - ధైర్యంగా ఆ మాటపై నిలబడదాం"



భారీ ర్యాలీ మరియు బహిరంగ సభ

నెల్లూరు పట్టణం గాంధీబొమ్మ సెంటరు నుండి పురమందిరం వరకు 1వ తేది ఉదయం 8 గంటలకు ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, అధికారులు, అనధికార ప్రముఖులతో భారీ ర్యాలీ నిర్వహించబడును. తదుపరి పురమందిరము నందు గొప్ప బహిరంగ సభ నిర్వహించబడును. ఈ సభకు జిల్లా కలెక్టర్ **శ్రీ యం.రవిచంద్ర I.A.S.**, గారు అధ్యక్షత వహించెదరు. నెల్లూరు శాసన సభ్యులు **గౌ॥శ్రీ ఆనం వివేకానందరెడ్డి గారు,** నెల్లూరు జిల్లా పరిషత్ ఛైర్మన్ **గౌ॥శ్రీ కాకాని గోవర్ధన్‌రెడ్డి గారు**, నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ **గౌ॥శ్రీమతి పోలిమి శైలజ గారు** ముఖ్య అతిథులుగా పాల్గొనెదరు.

ఫై ర్యాలీ మరియు బహిరంగ సభకు ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయప్రార్థన.

నెల్లూరు జిల్లాలో ఎయిడ్స్ నివారణకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు:

ఉచిత స్వచ్ఛంద రక్తదాత HIV పరీక్ష మరియు సలహా కేంద్రాలు: (VCCTC): 1. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, నెల్లూరు 2. జిల్లా క్షయ ఆసుపత్రి, నెల్లూరు. 3. ఏరియా ఆసుపత్రి, కావలి. 4. ఏరియా ఆసుపత్రి, గూడూరు. 5. ప్రభుత్వ ఆసుపత్రి, వెంకటగిరి, 6. ప్రభుత్వ ఆసుపత్రి, సూళ్లూరుపేట.

తల్లితండ్రుల నుండి బిడ్డకు HIV సోకకుండా నివారణ కేంద్రం : (PPTCTC): 1. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, నెల్లూరు. 2. ఏరియా ఆసుపత్రి, కావలి. 3. ఏరియా ఆసుపత్రి, గూడూరు.

సమగ్ర సలహా మరియు పరీక్ష కేంద్రాలు : (ICTC) : ఆత్మకూరు, రాపూరు, కోవూరు, ఉదయగిరి, వాకాడు, అల్లూరు, వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రులు మరియు సైదాపురం, కోట, నాయుడుపేట, వింజమూరు, మర్రిపాడు, కలిగిరి, మల్లాం, కోవూరుపల్లి, కొడవలూరు, నర్రవాడ, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట, వెంకటాచలం, దక్కిలి, పొదలకూరు, కలువాయి, దొరవారిసత్రం, తడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు.

రక్త నిధులు: 1. జిల్లా ప్రభుత్వ వైద్యశాల, నెల్లూరు. 2. ఏరియా ఆసుపత్రి. 3. రెడ్‌క్రాస్ సొసైటీ, నెల్లూరు. 4. నారాయణ మెడికల్ కాలేజి, నెల్లూరు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల ఆదరణ మరియు సంరక్షణ కేంద్రాలు : భవాని ఎడ్యుకేషన్ ఆఫ్ సొసైటి, ముంగమూరు క్రాస్‌రోడ్డు, బోగోలు మండలం.

ఎయిడ్స్ నివారణకు కృషి చేయుచున్న స్వచ్ఛంద సంస్థలు: చైతన్య జ్యోతి, డ్యూటీస్, సపోర్ట్, నెహ్రూ యువకేంద్రం, వరల్డ్ విజన్, జాగృతి, డ్రైస్.



డా॥ పి.వి.రమాదేవి M.B.B.S., D.D.,
జిల్లా లెప్రసీ అధికారి మరియు
జిల్లా ఎయిడ్స్ నోడల్ అధికారి, నెల్లూరు.

గమనిక: ప్రతి బుధవారం రాత్రి 8.30 గం॥లకు సప్తగిరి ఛానల్‌లో ప్రసారం అవుతున్న "ఆశయం" సీరియల్ తప్పకుండా చూడండి. ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించుకోండి.

యం.రవిచంద్ర I.A.S.,
జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్,
ఛైర్మన్, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటి, నెల్లూరు.



'వృక్ష్వేధ' కలహ బాధ!

జె.నరసింహశాస్త్రి హైదరాబాద్

* అపార్టుమెంటులో మా యింటి ద్వారానికి ఎదురుగా, వేరే యింటి సింహ ద్వారం వుంది? అబ్బాయి అనారోగ్యానికి, దీనికి సంబంధం వుందా?

ఇలా వుంటే 'వృక్ష వేధా దోషం' కలిగి, ఇంటి యజమాని, పుత్ర సంతతి అనారోగ్యాల పాలవుతారు.

కె.మధుసూధనరావు నెల్లూరు

* మా యింటి తలుపుకు అవతల ఇంటి గోడ మూల తగులుతూ వుంది. వాకిలికి ఎదురుగా వారి యింటి పిల్లర్ కూడా వుంది.

వాస్తు సందేహాలు - సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి

ఫోన్ : 6532337

4వ వీధి, గాయత్రినగర్

ఎ.కె.నగర్ పోస్టు, నెల్లూరు - 4.

మీ యింటికి కోణవేధ దోషం తగులుతూ వుంది. మీ సింహ ద్వారాన్ని ఈశాన్యంలో పెట్టండి. తూర్పు ఆగ్నేయ ద్వారం స్త్రీ సమస్యల్ని తెచ్చి పెడుతుంది.

కె.లక్ష్మీఝాన్సీ గుంటూరు

* ఉద్యోగ సమస్య తీవ్రమయింది. పెద్దమ్మాయి ఇంటికి చేరింది. ఏమిటీ పరిస్థితి?

ఆగ్నేయంలోని సెప్టిక్ ట్యాంకు తొలగించి, దాన్ని ఉత్తరం 'ఉచ్చం' వైపు మార్చండి. అమ్మాయి 'పగడం' శ్రేష్ఠ ధరించాలి. సమస్యలు పరిష్కారమవుతాయి.

పి.వి.ఎన్.అంజనారెడ్డి నెల్లూరు

* వాయువ్యం సెప్టిక్ ట్యాంకు తీసినా పరిస్థితి చక్కబడలేదు?

వాయువ్యం ప్రహరీని తెరవండి. సెప్టిక్ ట్యాంకు గోడలు తీసి వేయకుండా పూడ్చి వేయడం తప్పు.

పి.ధనుంజయ ఏలూరు

* మెట్లు, లోపల బయట వున్నాయి. ఏది మంచిది కాదు?

మీ ప్లాను ప్రకారం నైరుతి అంత రైట్లు మంచిది కాదు. తీసివేయాలి.

ఆకతాయిలు

5వ పేజీ కొరవ

సులను పెట్టి జులాయిల వీపు సాపు చేయిస్తే గాని కుల్లూరు బస్టాండ్‌లో ఈవ్ టీజింగ్ ఆగేట్లు లేదు.

ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారు

ఇందుకూరుపేట మండల కార్యాలయంలో 26తేది సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకరరెడ్డి 35 మందికి 1.75 లక్షల విలువైన ఎన్ఎఫ్‌బిఎస్ చెక్కులను, 63 మందికి ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జిల్లాకు ప్రాజెక్టులు, పరిశ్రమలు రానివ్వకుండా అడ్డుకుంటుందని నిప్పులు చెరిగారు. కృష్ణాపట్నం రైతులకు ఎకరాకు ఏడు లక్షల వంతున రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పరిహారం చెల్లిస్తుంటే నానా ఆగం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు, పేదలకు న్యాయం చేసేందుకు కట్టుబడి వుందన్నారు. తెలుగుదేశం పార్టీ పట్టణాలను అభివృద్ధి చేసి పల్లెలను పట్టించుకోలేదని దుయ్యబట్టారు. సర్వేపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో జిల్లా అంతటికీ ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో పార్టీలకతీతంగా ఇందిరమ్మ గ్రామాలను గుర్తించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కృష్ణాపట్నంలో రెండు మెగా పవర్ ప్లాంట్లు త్వరలోనే ఏర్పాటు కాబోతున్నట్లు చెప్పారు. కోడూరు వద్ద 500 మెగా పవర్ ప్రాజెక్టులు మరో రెండు వచ్చే అవకాశముందని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. దీంతో వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్గుతాయన్నారు. నెల్లూరు ఆనకట్ట నిర్మాణానికి 116 కోట్ల రూపాయల విడుదలకు ప్రభుత్వ అమోదం లభించినట్లు చెప్పారు. ఇందుకూరుపేట మండలంలో డిసెంబరు 1తేదీకి 2,600 మందికి 5.20 లక్షల రూపాయల పింఛన్లు పంపిణీ చేయనున్నామన్నారు. 2,500 మందికి కొత్తగా రేషన్‌కార్డులు పంపిణీ చేసినట్లు వివరించారు. పెన్నా డెల్టా ఆధునీకరణ కింద సీటి పారుదల కాల్వల రిపేర్లు చేయనుండడంతో ఈ ఏడాది రెండో పంటకు సీటి సరఫరా వుండదని తెలిపారు. మండలాధ్యక్షురాలు కె.రాధమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జడ్పీటీసి సభ్యురాలు కె.సంధ్య, ఎమ్మార్వో డి.శ్రీనివాసులు రెడ్డి, ఎంపిడిఓ సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌షాపులకు ఇంటర్వ్యూ

ఇందుకూరుపేట మండలంలో ఖాళీగా వున్న 8 చౌకదుకాణాలకు అర్హత కల్గిన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చునని ఎమ్మార్వో డి.శ్రీనివాసులురెడ్డి చెప్పారు. ఇందుకూరుపేట, కొత్తూరు గ్రామాల్లో గల ఆరు, జగదేవిపేట, పొగడ దొరువు కండ్రిగ గ్రామాల్లో ఒక్కో చౌకదుకాణాల్లో ఖాళీలున్నట్లు ఆయన తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 40 ఏళ్లలోపు వయస్సు కల్గిన స్థానికులు డిసెంబరు 11లోగా నెల్లూరు ఆర్డీవో కార్యాలయానికి తమ దరఖాస్తులను పంపించాల్సి వుంటుందన్నారు. ఇందుకూరుపేటలోని ఒకటో రేషన్‌షాపు ఎస్టీలకు, రెండో చౌక దుకాణం బిసిలకు, మూడో షాపు ఎస్టీలకు, కొత్తూరులోని ఒకటో దుకాణం ఎస్టీలకు, రెండో షాపు ఎస్సీలకు, మూడోది ఎస్టీలకు, జగదేవిపేట చౌకదుకాణం బిసిలకు, పొగడ దొరువు కండ్రిగ రేషన్‌షాపు మాత్రం ఎస్టీలకు రిజర్వు చేసినట్లు వివరించారాయన.

బుచ్చి పోలీసులకు వేధింపు ఫోన్లు!

బుచ్చిరెడ్డిపాళెంలో ఇళ్లలో ఒంటరిగా వుండే ఆడవాళ్లు, విద్యార్థినులను గుర్తించి ఆకతాయిలు అదే పనిగా ఫోన్లు చేస్తున్నారు. ఈ విషయాన్ని పలువురు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఆకతాయిలు ఇంతటితో ఆగకుండా పోలీస్‌స్టేషన్‌కే ఫోన్లు చేయనారంభించారు. వేధింపు ఫోన్లతో డ్యూటీలో వుండే పోలీసులు విసిగి పోతున్నారు. ఫోన్ చేయడం, గమ్మునుండడం, నవ్వడం, ఫలానా చోట ఏదో జరిగిందని చెప్పడం ఆకతాయిలు అలవాటుగా చేసుకొన్నారు. తీరా గందరగోళం జరిగిందన్న ప్రదేశానికి వెళ్లి పోలీసులు పరిశీలిస్తే అక్కడేమీ వుండడం లేదు. ఎస్ఐ స్టేషన్‌లో ఫోన్‌కు కాలర్ ఐడి పెట్టించడంతో సంగం హాస్టల్ నుంచి ఇవి వస్తున్నట్లు గుర్తించి వార్నింగ్ ఇచ్చారు. దీంతో ఆకతాయిలు కాయిన్ బాక్స్‌ల నుంచి ఫోన్లు చేస్తున్నారు. ఈ విషయమై స్టేషన్‌లోని కొందరు పోలీసులపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అన్నల బాంబులు

5వ పేజీ కొరవ

స్వాధీనం చేసుకోవడంతో రాయలసీమలో మావోయిస్టు దళం పూర్తిగా అంతరించిపోయినట్లేనని పోలీసులు భావిస్తున్నారు. దశరథ ఇచ్చిన సమాచారం ఆధారంగా ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లా అడవులలో మావోయిస్టులు తలదాచుకొనే స్థావరాలన్నీ పోలీసులకు తెలిసి పోయాయి. దీంతో ఈ దళాన్ని ఒక పథకం ప్రకారం మట్టు పెట్టేశారు. తప్పించుక వెళ్లిన దళ సభ్యులపై పోలీసులు దృష్టి పెట్టారు. ప్రస్తుతం జరిగిన ఎన్‌కౌంటర్, ఆయుధాల డంప్ స్వాధీనంతో రాయలసీమలో తిరిగి మావోయిస్టులు పుంజుకోవడం అంత సులభం కాదన్నది పరిశీలకుల అంచనా.



దివంగత బెజవాడ రామచంద్రారెడ్డి 112వ జయంతిని పురస్కరించుకొని పూర్వాశ్రమంలో ఆయన ప్రాసిన మూడ్యశతకాన్ని నెల్లూరు టౌన్‌హాల్‌లో ఆవిష్కరిస్తున్న బిజెపి జాతీయ నేత వెంకయ్య నాయుడు. ప్రక్కన జిల్లా జడ్జి నాగేశ్వరరావు, బెజవాడ దశరథరామిరెడ్డి, ఓబులరెడ్డి, బి.వి.నరసింహం వున్నారు.

నన్ను వదిలెయ్యండి

5వ పేజీ కొరవ


లేకపోయినా, ఎకరా 2 లక్షలు పరిహారం ఇస్తున్నాం. ఏ రైతూ దీనికి అభ్యంతరం పెట్టడం లేదు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పుట్టగతులుండవనే ఈ విమర్శలన్నారు. ఈ దశలో బుచ్చి జడ్పీటీసి గోవర్ధన రెడ్డి మాట్లాడబోగా ఛేర్మన్ గోవర్ధనరెడ్డి ల్యాండ్ అక్విజేషన్‌పై చర్చించే హక్కు జడ్పీ సమావేశానికి లేదని రూలింగ్ ఇచ్చారు. దీన్ని గోవర్ధనరెడ్డి తప్పు పట్టారు. ముందేమో చివర చర్చిద్దామని చెప్పి ఇప్పుడు అవకాశం లేదనడం భావ్యం కాదన్నారు. ఛేర్మన్‌ను వుద్దేశించి మిమ్మల్ని ఎవరో డిక్టేట్ చేస్తున్నట్లున్నారు. మీరు ఈ సభకు అధ్యక్ష

డినని గుర్తుంచుకోవాలన్నారు. సవాళ్లు, ప్రతిసవాళ్ల గందరగోళం మధ్య సమావేశం ముగిసింది. సమావేశానికి చదువుల మంత్రి రాజ్యలక్ష్మమ్మ, జిల్లా కలెక్టర్ రవిచంద్ర, ఎమ్మెల్యేలు రామనారాయణరెడ్డి, వివేకానందరెడ్డి, నెలవల సుబ్రహ్మణ్యం, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వివిధ శాఖల అధికార్లు హాజరయ్యారు.

మరో కుచ్చు టోపీ

5వ పేజీ కొరవ

తీసుకెళ్లమని చెప్పాడు. దీంతో వ్యాపారులు, స్థానికులు చేసేదేమీ లేక షాపులో వున్న సరకు, స్కూటర్‌ను లక్షా 30వేలకు లెక్కగట్టి తలా కొంతమేర పంచుకొన్నారు. 15 రోజుల క్రితం 50 లక్షల మేర బుచ్చి వాసుల నెత్తిన కుచ్చుటోపి పెట్టిన గోకుల బాబుకు, శ్రీనివాసులు బావమరిది. బుచ్చిలో మరికొంత మంది శెట్టిగార్లు ప్రజల నెత్తిన కుచ్చుటోపి పెట్టను సిద్ధంగా వున్నారు. వీరందరికి అధికార పార్టీ అండదండలున్నాయి. నమ్మకమే పునాదిగా బుచ్చివాసులను పలువురు దోచుకొంటున్నారు.



కీ బోర్డు వాయించడంలో అత్యుత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర ప్రభుత్వం నుంచి బాలరత్న అవార్డును అందుకొన్న రత్నం విద్యా సంస్థల విద్యార్థి శశాంక్‌ను టౌన్‌హాల్‌లో సత్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకానందరెడ్డి. మేయర్ శైలజ, కార్పొరేటర్ భానుశ్రీ, బి.వి.నరసింహం.

కె.వి.పెంచలయ్య నెల్లూరు

* ఏ గేటు తెరవాలో అర్థం కావడం లేదు. ఎప్పుడూ ఏదో ఒక సమస్య?

మీ సంస్థ భవన ప్రాంగణంలోని నైరుతి గేటును మూసివేసి, ఈశాన్యం గేటు గాని, ఉచ్చంలో గేటును గాని తెరవండి.

జిల్లా టైమ్స్

వెంకటరమణ విలాస్ మిద్దెపైన,

పొగతోట, నెల్లూరు - 1.

ఫోన్: 2327354

స్త్రీ స్పందన కూడా ప్రధానమే



శృంగార మాధుర్యం పట్ల ఆసక్తి స్త్రీ, పురుషులిద్దరికీ సమానమన్న వాస్తవం అందరికీ తెలుసు. కానీ పురుషాధిక్యతా ధోరణి కారణంగా గుణవంతురాలైన స్త్రీకి శృంగారం పట్ల ఆసక్తి వుండదన్న పోకడ సమాజంలో నాటుకు పోయింది. చాలా మంది స్త్రీలు వాళ్లకు తెలియకుండానే స్పందనను అణుచుకోవడంతో శృంగార కలాపాల సమయంలో సంపూర్ణంగా స్పందించలేరు. దీనివల్ల స్త్రీలు శృంగార మాధుర్యాన్ని పొందలేక పోవడమే గాక పురుషుడికి కూడా ఇబ్బందులు ఎదురయ్యేలా చేస్తున్నారు. నిజానికి ఆరోగ్యవంతులైన పురుషులు శృంగార సమస్యలకు లోనయ్యేందుకు దారితీసే ప్రముఖ కారణాలలో స్త్రీ సంపూర్ణంగా స్పందించక పోవడం కూడా ఒకటి. స్త్రీ తన స్పందనను అణుచుకునే అలవాటును మాన్పించడానికి సెక్స్ అండ్ మెరైటల్ కౌన్సిలింగ్‌లో విశిష్టమైన శిక్షణ వుంటుంది. శృంగార మాధుర్యాన్ని పొందడానికి స్త్రీ స్పందనకున్న ప్రాధాన్యతను గూర్చి భార్యాభర్తలిద్దరికీ స్పష్టంగా అర్థమైతేనే శృంగార సమస్య సమగ్రంగా పరిష్కరింపబడుతుంది.

– డా॥ఇ.రాజగోపాలరెడ్డి

సినిమా

వలవిసిరా! చిక్కుతాడా?

రంగ్‌దేబసంతి చిత్రంతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొన్న కునాల్ కపూర్‌ను హైదరాబాదీ, బాలీవుడ్ హీరోయిన్ దియామీర్జా తన గుప్పెట పట్టింది. ఈ విషయమై ప్రశ్నిస్తే తెలివిగా సమాధానం చెబుతుంది. మా ఇద్దరి మధ్య ఏదైనా వుండా



దియా సందేహం

లని నేను కోరుకొంటున్నా. అతనితో కలిసి బయటకు వెళ్లడానికి నేను ఇష్టపడతా. మేమిద్దరం మంచి స్నేహితులం. అతనంటే చాలా ఇష్టం. మా అనుబంధం గట్టిపడితే అంతకన్నా కావాల్సిందేముంది. అతడు అందగాడే కాదు, చక్కని వ్యక్తి. చాలా

తొరవ 11వ పేజీలో

అత్త మెచ్చిన కోడలు

హీరోయిన్‌గా ఖుష్బూను తమిళ ప్రేక్షకులు ఎప్పుడో నచ్చారు. అందువల్లే ఆమె పేరిట దేవాలయం కట్టారు. ఇటీవల పెళ్లికి ముందు సెక్స్ ఫర్వాలేదన్నందుకు ఆమెపై మండిపడ్డారు. తమ అభిమాన రాజకీయ నాయకుడు పెరియార్ భార్య పాత్రలో కుష్బూ నటిస్తున్నందుకు ముందు ఆమెను విమర్శించినా ఆ తర్వాత సర్దుకొన్నారు. ఇవన్నీ తనకు ఒక ఎత్తయితే అత్త తనను మెచ్చుకోవడమే గొప్పంటుంది ఖుష్బూ. ఈ ప్రపంచం వున్నంత వరకూ అత్తాకోడళ్ల మధ్య పోరు పొచ్చాలుండనే వుంటాయి. దీంతో మగ



వాళ్లను ఇబ్బంది పెట్టకూడదు. మా అత్తగారు షూటింగులకు వెళ్లిన నా కోసం ఎదురు చూస్తూ భోంచేయరు. నేను టైమ్‌కు తినమంటానంటుంది ఖుష్బూ ఈ అత్త మాత్రం ఖుష్బూను హృదయమున్నకోడలంటుంది. కుటుంబ సభ్యుల వుట్టిన రోజులన్నీ గుర్తుంచుకొని కొత్త బట్టలు తెస్తుంది. ఎంత బిజీగా వున్నా నిత్యం అందరి క్షేమ సమాచారాలు అడుగుతుంది. చుట్టాలెందరున్నా ఖుష్బూ ముందు అందరూ బలాదూర్ అని అత్త ప్రశంసిస్తుంది. ఈ వ్యవహారం చూస్తుంటే అత్త ఉన్నకోడలు ఉత్తమురాలనిపిస్తుంది కదూ?

కొగిలి చేరాడు! భలేవాడు!!

సమీరారెడ్డి హీరోయిన్‌గా తెలుగులో కేవలం మూడు చిత్రాల్లో నటించినా ఆమెకు మంచి గుర్తింపే వచ్చింది. దీనికి కారణాలు రెండు. ఒకటి మితిమీరిన దేహ ప్రదర్శన, రెండోది హీరో ఎన్టీఆర్‌తో ఆమెకు సంబంధ ముందన్న ప్రచారం.



సమీరా ఆనందం

ఆమె నటించిన తెలుగు చిత్రాలు బాగా ఆడక పోవడంతో ఈ మధ్య బాలీవుడ్‌లోనే తన అదృష్టం పరీక్షించుకొంటుంది. అయితే ఈ మధ్య సమీరా నటించిన 'నక్ష' చిత్రం ప్లాప్ అయ్యింది. అయినా ఆమె పెద్దగా బాధపడడం లేదు. న్యూయార్క్‌కు చెందిన రియల్

తొరవ 11వ పేజీలో

రాజకీయ గాలి

తెలుగు ప్రేక్షకులను సైతం ఆకట్టుకొన్న మళయాళ హీరోయిన్ గోపికకు ఆవేశం ఎక్కువ. ఆమె షూటింగ్ గ్యాప్‌లో



సినిమా సంగతులు గాక స్త్రీల హక్కుల గూర్చి మాట్లాడుతుంది. పార్లమెంటులో 33 శాతం స్థానాలను స్త్రీలకు కేటాయిస్తా

తొరవ 11వ పేజీలో

"మాణిక్యం-420" ఫర్వాలేదు మంచోడే

పిల్లల్ని, పెద్దలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం తప్పుత్రోవ పట్టిస్తే చివరికి వారు ఏ విధంగా తయారవుతారనే దానికి సజీవ నిదర్శనం మాణిక్యం - 420 చిత్రం. తమిళంలో తయారైన ఈ చిత్రాన్ని పన్నాల అరవింద్ తెలుగులోకి అనువదించారు. కథలో చెప్పుకోవాల్సినంత గొప్పతనమేమీ లేకపోయినా చక్కని స్క్రీన్‌ప్లే ఈ చిత్రానికి ప్రాణం పోసింది. గ్లామర్ ప్రదర్శనకు దూరమని చెబుతుండే సోనిఅగర్వాల్ ఈ చిత్రంలో రెండుసార్లు బికినీలో కనపడడంతో పాటు, చిత్ర మంతా బిగుతైన పొట్టి దుస్తులతో కనపడి యువ ప్రేక్షకులను అలరిస్తుంది. మరో గ్లామర్ నటి మాళవికతో పాత్రోచితంగా చేయించిన దేహ ప్రదర్శన ఈ చిత్రానికి మరో అదనపు ఆకర్షణ. విదేశీ డ్యాన్సర్ల బెల్లీ నృత్యం అదుపు తప్పిన అందాల ప్రదర్శనే. మాణిక్యం అనువాద చిత్రమైనా మాటల రచయిత శ్రీరామకృష్ణ తనదైన

చిత్ర సమీక్ష

అల్లూరు రహీం

ప్రత్యేక శైలిలో మాటలు వ్రాశాడు. డైరెక్ట్ సినిమాల్లో ఇటువంటి డైలాగులు ఈ మధ్య వినరావడం లేదు. తనతో గడిపిన మహిళను వుద్దేశించి రంకు మొగుడు - ఒక్కసారి చేస్తే తప్పు, వందసార్లు చేస్తే స్టైల్ అంటాడు. మరోచోట దేశంలోని పద్ధతులను తూర్పారబడుతూ విదేశాల్లో పబ్లిక్‌గా ముద్దు పెట్టుకోవచ్చు, పబ్లిక్‌గా మూత్ర విసర్జన చేయకూడదు - కాని ఇండియాలో దీనికి రివర్స్- మంచి భర్త, డబ్బు, సంఘంలో గౌరవం కన్నా ఆడదానికి సెక్స్ ప్రధానమా అనే డైలాగ్ ఫెమినిస్ట్‌లకు రుచించక పోవచ్చు. చిత్రంలో దరిదాపులు అన్నీ పాటలు ఆస్ట్రేలియాలో చిత్రీకరించారు. వీటిలో 'తిప్పమ్మా... తిప్పమ్మా వయ్యారంగా' పాటను బెల్లీ డ్యాన్స్‌కు అనుగుణంగా భువనచంద్ర కష్టపడి వ్రాశాడు. బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే 'వినరా వినరా మంచి మాటని' పాట అర్థవంతంగా వుంది. వీటికి భరద్వాజ్ ఓ మోస్తరు సంగీతం సమకూర్చారు. పాత కథను కొత్తగా చూపను కథతో పాటు స్క్రీన్‌ప్లే వ్రాసుకొని దర్శకత్వం కూడా వహించిన సుశిగణేష్ పూర్తి స్థాయిలో విజయం సాధించక పోయినా, తనలో అంతోఇంతో ప్రతిభ వుందని ఈ చిత్రం ద్వారా చాటి చెప్పాడు. అక్రమ సంబంధాల నేపథ్యంలో కథ నడపడం, వీటితో ముడిపడి వున్న సన్నివేశాల చిత్రీకరణ విచ్చలవిడిగా వుండడం వల్ల కుటుంబ సమేతంగా ఈ చిత్రానికి వెళ్లలేరు. మాణిక్యం యూత్‌ను దృష్టిలో పెట్టుకొని తీసిన చిత్రమని సరిపెట్టుకోవాల్సిందే!

కథా గమనంలోకి వెళ్తే మాణిక్యం

తొరవ 11వ పేజీలో

మంద బుద్ధి అందగత్తె

వీరభద్ర ఫేం తనుశ్రీదత్తా, మాజీ మిస్ ఇండియా కూడా. తనుశ్రీదత్తా మతి మరుపు సమస్యను ఎదుర్కొంటుంది. ఆమెకు



ఎవరివైనా ఫోన్ నెంబర్లు, పుట్టిన రోజులు, హాజరవ్వాల్సిన షూటింగులు గుర్తుండవట. దీంతో ప్రతిదానికి కార్యదర్శి మీద ఆధారప

తొరవ 11వ పేజీలో

చూపింది! ఊపింది!!

హీరోయిన్లు వెండితెరపై చూపే అందాలు ప్రేక్షకులకు నచ్చితేనే అటువంటి వారికి అవకాశాలు దక్కడం, లేకుంటే సోదిలోకి లేకుండా పోవడం జరుగుతుంది. భాగ్యలక్ష్మి బంపర్ డ్రా చిత్రంలో తడిచిన దుస్తుల్లో అందాల ప్రదర్శన చేసిన ఫర్జానాను యువ ప్రేక్షకులు మెచ్చారు. దీంతో 'సీమ శాస్త్రి' చిత్రంలోనూ అవకాశం మెతు



ఫర్జానా జోరు

క్కింటూ వచ్చింది ఈ మోడల్‌కు. హీరోయిన్ల అందాలు బాగా చూపే దర్శకునిగా పేరుగాంచిన నాగేశ్వరరెడ్డి, సీమశాస్త్రి చిత్రానికి దర్శకత్వం వహిస్తుండడంతో ఫర్జానా మరికొన్ని చిత్రాలపై ఆశలు పెట్టుకొంది. అతి సర్వత్ర వర్జయేత్ అంటారు. దీన్ని ఫర్జానా గుర్తుంచుకోవడం మంచిదేమో!

తరుణ్ తరిగి పోయాడు

బాలనటుడిగా వుంటూ హీరోగా ఎదిగిన తరుణ్ తన కెరీర్‌ను తానే చేతులారా నాశనం చేసుకొన్నాడు. దీనికి కారణం అతని సరసన నటించిన హీరోయిన్లను ప్రేమ పేరుతో వంచించడమేనంటున్నారు. తొలుత స్నేహ, ఆ తర్వాత ఆర్తీ అగర్వాల్‌తో తరుణ్ ప్రేమ వ్యవహారాలు పెళ్లి వరకు వెళ్లడం, తల్లిరోజారమణి రంగ ప్రవేశంతో గందరగోళానికి దారితీశాయి. దీంతో యువ హీరోయిన్లంతా తరుణ్ సరసన నటించడానికి ఆసక్తి చూపడం లేదు. మొత్తం మీద తరుణ్ తన కెరీర్‌ను తానే ధ్వంసం చేసుకొన్నాడు. ఇప్పటికైనా తరుణ్‌కు జ్ఞానోదయం కలిగితే మంచిది.

మనవాళ్లు మారాలి

బంగారం చిత్రంలో పవన్ కళ్యాణ్ సరసన నటించిన మీరా చోప్రాకు మూఢ నమ్మకాలంటే మహా చిరాకు. ఈ విషయమై మాట్లాడుతూ చిత్ర రంగంలో ప్రవేశిస్తూ కొందరు తమ పేర్లు మార్చుకొంటారు. ఒక పేరుతో వచ్చిన సినిమా హిట్ అయితే మళ్లీ మళ్లీ అదే అక్షరం వచ్చేట్లు పేరు పెడతారు. ఒక్కోసారి అదే బ్యానర్‌పై పాత నటీనటులతో సినిమా తీస్తారు. ఇటువంటి మూఢ నమ్మకాన్ని మనవాళ్లు దూరం చేసుకోవాలి. లేదంటే మన సిని

తొరవ 11వ పేజీలో

బావతో ఎలాగబ్బా?

బాలీవుడ్ నటి అమృతారోరా తనను ఐటమ్ గర్ల్ అంటే ఒప్పుకోవడం లేదు. జమీన్ చిత్రంలో నేను నటించిన పాటలు ఐటమ్ సాంగ్స్‌గా కనపడడానికి వాటిని చిత్రీకరించిన తీరే కారణం. తాను మాత్రం గ్లామర్ పాత్రలే పోషిస్తున్నానంటుంది. అర్భాజ్‌ఖాన్ సరసన హీరోయిన్‌గా నటించే ఛాన్స్‌ను పోగొట్టుకొన్న విషయం అది



అమృత సతమత

గితే ఆ సినిమాలో పాత్ర ప్రకారం అర్భాజ్‌తో కాస్త సిగ్గిడిచి నటించాలి. నేను ఆయనకు స్వయానా మరదలిని. వ్యక్తిగతంగా ఈ వ్యవహారం నాకు ఇబ్బంది తెచ్చి పెడుతుంది. ఒకవేళ విమర్శలకు తెరవక నటించానుకోండి మా అక్క పిల్లలు, నాన్నతో

తొరవ 11వ పేజీలో

వారఫలాలు

తేది 2-12-2006 నుంచి 8-12-2006 వరకు రవి, కుజ, గురువులు వృశ్చికంలో; బుధుడు తుల, వృశ్చికాల్లో; శుక్రుడు వృశ్చిక, ధనుస్సుల్లో; శని, కేతువులు సింహంలో; రాహువు కుంభంలో; మేష, వృషభ, మిథున రాశుల్లో చంద్రుడు సంచరిస్తారు.

మేషం

(అశ్వని, భరణి, కృత్తిక 1 పాదం)

ఆరోగ్య విషయంలో చెప్పుకోదగ్గ ఇబ్బందులుండవు. భార్యాభర్తల సంబంధం బాగుంటుంది. సంతానమూలక బాధలుంటాయి. వారి ఆరోగ్య లోపం ఆందోళన కల్గిస్తుంది. కుటుంబ పెద్దల నుంచి సహకారాలుంటాయి. ఊహించని ధనాదాయం వుంటుంది. వ్యాపార రంగంలోని వారికి ప్రోత్సాహకరంగా వుంటుంది. నూతన ప్రణాళికలు చేస్తారు. వృత్తిలోని వారికి మంచికాలం. ఉద్యోగులకు పలుకుబడిదారుల సహాయం లభిస్తుంది. విద్యార్థులకు అంత యోగకాలం కాదు.

వృషభం

(కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశీర్ష 1,2 పాదాలు)

పైత్యప్రకోపం వల్ల శరీరారోగ్యం దెబ్బతినే అవకాశం వుంది. బిపి లాంటివి బాధిస్తాయి. పాత స్నేహితుల కలయిక ఆనందాన్నిస్తుంది. విందులు, వినోదాలలో పాల్గొంటారు. ధనాదాయ వృద్ధికి నూతన ప్రణాళికలు తయారు చేస్తారు. త్వరలోనే వాటిని ఆచరణలోకి తెస్తారు. ఖర్చులు ఎక్కువగా వుంటాయి. వాహనాలు కొనడమో, రిపేరు చేయించడమో జరుగుతుంది. వ్యాపారులు జాగ్రత్తగా వుండాలి. భాగస్వాముల మూలంగా నష్టాలుంటాయి. కొత్త వ్యాపార విషయాలకు ధనం మళ్లింపు అవకాశం వుంది. ఉద్యోగులకు అధికారుల ఆదరాభిమానాలు లభిస్తాయి. విద్యార్థులు కాలం వృధా చేస్తారు.

మిథునం

(మృగశిర 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు)

ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి. ఆహార విషయాలలో శ్రద్ధ లేకుంటే జీర్ణకోశ వ్యాధులుంటాయి. కుటుంబ సుఖ సంతోషాలు లోపిస్తాయి. భార్యాభర్తల మధ్య సఖ్యత కొరవడుతుంది. వాగుడు తగ్గించాలి. ధన విషయంలో ఇబ్బందులుంటాయి. వైద్య ఖర్చులుంటాయి. వ్యాపార రంగంలోని వారికి ఒత్తిడి వుంటుంది. కొత్త ప్రణాళికలు ఆచరణలోకి తేరాదు. ఈనెల అంతా గురువు, దక్షిణామూర్తి, కేతువులను కొలవాలి. ఉద్యోగులు కూడా చాలా ఇక్కట్లకు గురవుతారు. వృత్తిలోని వారు అధిక శ్రమ ప్రదర్శించినా ఫలితం తక్కువగా వుంటుంది. విద్యార్థుల పరిస్థితి అంతంతే. పరిసరాల్లో ఇతరుల సాయం లభించదు.

కర్కాటకం

(పునర్వసు 4 పాదం, పుష్యమి, ఆశ్లేషలు)

ఆరోగ్య విషయంలో ఎలాంటి ఇబ్బందులుండవు. దీర్ఘకాలిక రోగులకు కూడా కొంత ఆశ్వాసన వుంటుంది. కుటుంబంలో సభ్యుల మధ్య సఖ్యత వుంటుంది. కళత్రంతో సంబంధ బాంధవ్యాలు బాగుంటాయి. బంధుమిత్రుల సహాయ సహకారాలుంటాయి. దుర్వార్త వింటారు. ధనాదాయం బాగుంటుంది. ఖర్చులు ఎక్కువైనా ఇబ్బంది వుండదు. భాగస్వాముల సలహాలను పాటించి వ్యాపారాభివృద్ధిని గడిస్తారు. వృత్తిలోని వారికి మేలైన కాలం. ఉద్యోగులకు లాభదాయకమైన కాలం. ఎదురు చూసిన శుభ ఫలితాలు పొందుతారు. విద్యార్థులకు మేలైన సమయం కాదు.

సింహం

(మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం)

ఆరోగ్య విషయంలో చిన్న చిన్న సమస్యలుంటాయి. గ్యాస్ట్రిక్ బాధలుంటాయి. కుటుంబ సభ్యుల సఖ్యత మీకు నూతనోత్సాన్నిస్తుంది. ఆధ్యాత్మిక, పూజాది కార్యక్రమాల్లో పాల్గొంటారు. ధనాదాయ విషయంలో ఎలాంటి లోపముండదు. స్పెక్యులేషన్లు లాభిస్తాయి. వ్యాపార రంగంలోని వారి ముందుచూపు మంచి లాభాల్ని తెచ్చి పెడుతుంది. వృత్తిలోని వారికి కీర్తి ప్రతిష్టలతో పాటు ధనార్జన కూడా బాగుంటుంది. ఉద్యోగులకు, విద్యార్థులకు మంచి కాలం. దూర ప్రయాణాలుంటాయి.

కన్య

(ఉత్తర 2,3,4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు)

పేగులకు సంబంధించిన చిన్న చిన్న రోగ బాధలుంటాయి. కుటుంబ సభ్యుల్లో కొందరు మీ అభిప్రాయాలకు విరుద్ధంగా నడుచుకొంటారు. సంతాన మూలక ఇబ్బందులుంటాయి. ధనాదాయ విషయంలో చాలా బాగుంటుంది. రావలసిన బాకీలు అందుతాయి. స్పెక్యులేషన్ కొంత ఫర్వాలేదు. వ్యాపార రంగంలోని వారికి అంత మేలైన కాలం కాదు.ఉద్యోగులకు బాగుంటుంది. వృత్తిలోని వారికి మంచి పోటీ వుంటుంది. విద్యార్థులకు మిశ్రమ ఫలితాలుంటాయి.

పంచాంగం

2తేది శని త్రయోదశి. 6తేది గురు మౌఢ్యం త్యాగం, 4తేది దత్తజయంతి.

డిసెంబరు తిథులు

2	శని	ద్వాదశి	మ. 1.28	గం.ల వ
3	ఆది	త్రయోదశి	ఉ.10.46	గం.ల వ
4	సోమ	చతుర్దశి	ఉ. 8.11	గం.ల వ
		పౌర్ణమి	తె. 5.51	గం.ల వ
5	మంగళ	పాడ్యమి	తె. 3.54	గం.ల వ
6	బుధ	విదియ	రా. 2.31	గం.ల వ
7	గురు	తదియ	రా. 1.51	గం.ల వ
8	శుక్ర	చవితి	రా. 1.51	గం.ల వ

పి.ఎం.గోపాలాచారి,
16/1020, పాగతోట, నెల్లూరు - 1.

తుల

(చిత్త 3,4పాదాలు, స్వాతి, విశాఖ1,2,3 పాదాలు)

ఆరోగ్య విషయంలో పెద్దగా ఇబ్బందులుండవు. కుటుంబ సభ్యుల మధ్య సదవగాహన వుంటుంది. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. బంధుమిత్రుల సమాగమం వుంటుంది. ధన విషయంలో ఎలాంటి లోపముండదు. ఖర్చులు మీ ఆధీనంలో వుంటాయి. స్పెక్యులేషన్ జోలికి పోవద్దు. వ్యాపారంలో భాగస్వామి, మిత్రుల వల్ల లాభాలుంటాయి. వృత్తిలోని వారు చక్కగా రాణిస్తారు. ఉద్యోగులు తమ విరోధులపై అధిగమించి లాభపడతారు. ఇతోధిక పదవీ బాధ్యతల్ని స్వీకరించి రాణిస్తారు. విద్యార్థులకు చాలా మంచికాలం. పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తారు.

వృశ్చికం

(విశాఖ 4పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వుండాలి. చెవి, గొంతు, ఊపిరితిత్తుల బాధలుంటాయి. కుటుంబంలో ఊహించని సమస్యలుంటాయి. తల్లి, తల్లి వంటి వారి అనారోగ్యం ఆందోళన కల్గిస్తుంది. ధనాదాయం మిశ్రమంగా వుంటుంది. అప్పులు చేసే అవకాశాలున్నాయి. వ్యాపార రంగంలోని వారు చాలా శ్రమ పడతారు. ఉద్యోగులకు అనుకొన్న మార్పులుంటాయి. విద్యార్థులు ఊహించని ఫలితాల్ని పొందలేక పోవచ్చు.

ధనుస్సు

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పాదం)

దీర్ఘ రోగులకు కొంతమేర వైద్య సలహా అవసరం. ఇతరులకు ఆరోగ్య విషయం అంతగా బాధించదు. ఇరుగు పొరుగు వారితో గొడవలు, సామరస్యంగా సద్దుమణుగుతాయి. కుటుంబ సభ్యుల మధ్య అవగాహన బాగుంటుంది. ధన విషయం సంతృప్తికరంగా వుంటుంది. వివిధ మార్గాల ద్వారా ధనప్రాప్తి వుంటుంది. వ్యాపారులు జాగ్రత్తగా వుండాలి. మోసానికి గురవుతారు. పోటీ వున్నా అధిక ధనాదాయం వుంటుంది. వృత్తిలోని వారు తమ సంస్థల అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తారు. ఉద్యోగులు రాణిస్తారు. కొత్త ఉద్యోగావకాశాలున్నాయి. విద్యార్థులకు మంచికాలం. పోటీలలో నెగ్గుకొస్తారు.

మకరం

(ఉత్తరాషాఢ, 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1,2 పాదాలు)

చెప్పుకోతగ్గ ఆరోగ్య సమస్యలు లేవు. కుటుంబ సభ్యులతో, భర్తతో గొడవలు పడే అవకాశాలున్నాయి. సంతాన సంబంధ బాధలుంటాయి. ధన విషయం సాధారణం. ఖర్చుకు తగిన ఆదాయముంటుంది. నూతన గృహోపకరణాలు కొంటారు. వ్యాపార రంగంలోని వారు సత్ఫలితాల్ని ఎదురు చూడలేరు. సులభంగా మోసపోతారు. ఉద్యోగులకు ఇంతకు ముందు వలె కష్టాలు తప్పవు. వృత్తిలోని వారి గౌరవ, మర్యాదలు దెబ్బతినే అవకాశముంది. ఎంత కష్ట పడినా ప్రయోజనం శూన్యం. విద్యార్థులకు చదువు చక్కగా సాగదు.

కుంభం

(ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిష, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు)

ఆరోగ్య లోపముండదు. ధనాదాయం చక్కగా వుంటుంది. కుటుంబంలో ఎలాంటి కలతలు లేకుండా హాయిగా సాగిపోతుంది. రావలసిన డబ్బు చేతికందుతుంది. సంతాన మూలక శ్రమ వుంటుంది. వ్యాపారులకు మిశ్రమ ఫలితాలుంటాయి. వృత్తిలోని వారికి శ్రమ అధికంగా వుంటుంది. ఉద్యోగులకు సొంత బాకీలు లభించే అవకాశం వుంది. అధికారులతో జాగ్రత్తగా మెలగాలి. విద్యార్థులకు అంతగా ఏకాగ్రత కుదరక పోవచ్చు. పోటీ పరీక్షల్లో నిరాశ ఎదురవుతుంది.

మీనం

(పూర్వాభాద్ర 4 పాదం, ఉత్తరాభాద్ర, రేవతి)

ఆరోగ్య విషయంలో చెప్పుకోతగ్గ మార్పులు లేవు. కొందరికి మానసిక అస్వస్థత వుంటుంది. భార్యాభర్తల సంబంధం చక్కగా వుంటుంది. పరస్పర అవగాహన, సహకారాలుంటాయి. ధన విషయంలో ఎలాంటి లోటు వుండదు. వివిధ మార్గాల్లో ధనప్రాప్తి వుంటుంది. వ్యాపారులకు చాలా చక్కనికాలం. వ్యాపారాభివృద్ధికి నూతన మార్గాలు అన్వేషిస్తారు. వృత్తిలోని వారికి కీర్తి ప్రతిష్టలతో పాటు ధనాదాయం కూడా చక్కగా వుంటుంది. ఉద్యోగులకు పదోన్నతి అవకాశాలున్నాయి. విద్యార్థులకు చక్కని అవకాశం లభిస్తుంది.

జనవాణి

3వ పేజీ కొరవ

పదేళ్లుగా పాస్ కాలేదు. లాలూ ప్రసాద్, ములాయంసింగ్ ఈ బిల్లుకు అడ్డంకి అని చెప్పేవారు. లాలూ ప్రసాద్ మహిళా బిల్లుకు ఇప్పుడు ఓకే అంటున్నారు. ఇకనైనా ఈ బిల్లుకు పార్లమెంటు నుంచి మోక్షం కల్పించాలి.

నెల్లూరు — పి.అరుణకుమారి

బెజవాడ సేవలు స్మరణీయం

స్వర్గీయ బెజవాడ రామచంద్రారెడ్డి గారు రాజసం వుట్టిపడే వ్యక్తి. ఆయన ధరించే తలపాగా ఆయనకొక ప్రత్యేకతను సంతరించి పెట్టింది. స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన ప్రథమ లోక్‌సభలో సభ్యులుగా జాతీయ ఫ్రంట్‌కు ఉపనాయకులుగా ఆయన వ్యవహరించారు. జస్టిస్ పార్టీలో ప్రముఖ నాయకులుగా చలామణి అయ్యారు. మద్రాసు శాసనమండలి సభాధ్యక్షులుగా పనిచేశారు. రెడ్డి గారి సౌజన్యత సేవ కూడా ఎన్నదగింది. పండితులు స్వర్గీయ అయితం శాలివరప్రసాదరావు కావ్యం బోసు భారతానికి ఆయన వ్రాసిన పీఠిక అద్భుతం. వీరం వెంకటరాయశాస్త్రిని కూడా ఖద్దరులో తన సభ్యత్వంలో సన్మానించారు. ఆ మహనీయుని 112 జయంతి వేడుకలను నెల్లూరులో ఆయన పుత్రులు ఘనంగా జరపడం సంతోషకరం.

నెల్లూరు — అవనిగడ్డ కృష్ణమూర్తి

డిఏ బకాయిలివ్వండి

ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలకు 2006-07 ఆర్థిక సంవత్సరంలో జూన్, జులై, ఆగష్టు నెలల జీతాలకు గాను కొత్త జీతాలు అమలుకు అదనంగా గ్రాంటును విడుదల చేశారు. ఈ మొత్తంలో విడుదలైన మూడు నెలలకు పోను యింకా కొంత మిగిలి వుంది. ఈ గ్రాంటును గత ఐదేళ్లుగా రావాల్సిన కరవు భత్యం ఖాతాలో జమ చేయమని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

విద్యానగర్ — ఆశం సుధాకర్‌రావు

అయ్యప్పలపై చిన్నచూపు

అయ్యప్పదీక్ష వస్త్రాలు ధరించి బడికి రాకూడదని కొందరు హెడ్‌మాస్టర్లు విద్యార్థులకు హుకుం జారీ చేయడం బాధాకరం. శిలువ ధరించి రావద్దని క్రైస్తవులను, తలపాగా వద్దని సిక్కులను, టోపీ ధరించరాదని ముస్లింలను ఆటంకపరచగలరా? ఇది లౌకిక రాజ్యమని చెప్పుకోవడానికి, రాజ్యాంగంలో వ్రాసుకోవడానికి తప్ప ఆచరణలో అంతా పక్షపాతమే కనిపిస్తోంది. చట్టం ముందు అందరూ సమానమే అనడం బాగానే వుంది. కానీ సమానత్వం ఎక్కడ వుంది. అంతా ఆధిపత్య ధోరణి ప్రబలిపోతుంది. పర్సనల్ లా అని ఒక వర్గం అనేక విషయాలలో ప్రభుత్వానికి సవాలు విసురుతోంది. మత మౌఢ్యం, కులజాఢ్యం, అవినీతి, రాజకీయం సమాజాన్ని ఇప్పటికే భ్రష్ట పట్టించాయి. మంది బలం ప్రభుత్వాలను కట్టడి చేస్తోంది. ఈ పద్ధతి మారాలి.

కావలి — కె.అనంతయ్య

అనారోగ్య ప్రదేశ్

డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వేళా విశేషమేమిటోగాని రాష్ట్రం అనారోగ్య ప్రదేశ్‌గా మారిపోయింది. దోమల రాజ్యం అవతరించింది. ఒకప్పుడు మలేరియా, టైఫాయిడ్ అంటే ప్రజలు భయపడి పోయేవారు. వీటిని మించి చికున్‌గున్యా, డెంగ్యూలు మృత్యుదేవత రూపం దాల్చి ముంచుకొచ్చాయి. రాష్ట్ర ఆరోగ్య మంత్రి రోశయ్య ఇళ్లలో పరిశుభ్రత వుంటే రోగాలు రావని చెబుతూ ఆయన ఇంట్లో చికున్ గున్యా వచ్చినా స్పందించలేదు. దోమల నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ డెంగ్యూ కార్యక్రమం తూతూ మంత్రంగా చేయడం బాధాకరం. ఇప్పటికైనా ప్రభుత్వం దోమల నిర్మూలనకు చిత్త శుద్ధి చర్యలు చేపట్టాలి.

నెల్లూరు — డి.సాయిచందన

50 ఏళ్ల క్రితం

3వ పేజీ కొరవ

ర్థిని పెట్టలేదు. అదీగాక పాటిల్, గోపాలరెడ్డి స్వయంగా వారిని బలపరుస్తూ ఉపన్యాసాలు కూడా యిచ్చారు. సుబ్రహ్మణ్యేశ్వర రావుకు ఆ నియోజక వర్గంలో ఎక్కువ మంది అనుయాయులు, పలుకుబడి వుందని కాంగ్రెసు గమనించి వారికి పోటీగా అభ్యర్థిని నిలుపలేదు. అలాగే రెడ్డి గారికి కూడా కాంగ్రెసు పోటీ పెట్టకుండా వుండగలదా అని రాజకీయజ్ఞుల ప్రశ్న. కమ్యూనిస్టు నాయకుడు సుందరయ్య చైనా వెళ్లే ముందు తాము రామచంద్రారెడ్డి గారిని బలపరచ చలచుకున్నట్లు యిక్కడ అన్నాడని తెలిసింది. ఇంకా కావలసినంత వ్యవధి వున్నది కాబట్టి ఈ ప్రశ్నే ఏ రూపం ధరిస్తుందో చూడవలసి వున్నది.

నెల్లూరు ముచ్చట్లు

కావలి స్టేట్‌బ్యాంకి బ్రాంచి

ఈనెల 26తేది కావలిలో స్టేట్ బ్యాంకి బ్రాంచి ఆఫీసుకు ప్రిన్సిపాల్ టోండె ప్రారంభోత్సవం చేశారు. కలెక్టరు మొహిబుల్లా గారు సభకు అధ్యక్షత వహించారు. నెల్లూరు స్టేట్‌బ్యాంకి ఏజంటు ఆర్ఎన్ దేనియల్ కొత్తగా నెలకొల్పబడిన బ్రాంచి ద్వారా వర్తకులకు, ఇతరులకు లభించగల సౌకర్యాలను వివరించారు. త్వరలో కోవూరులో కూడా మరొక బ్రాంచి ప్రారంభించబడగలదని తెలియజేశారు. కావలి బ్రాంచి ఏజంటు జెఎల్ నోరెస్ వందన సమర్పణ జేస్తూ ప్రజాసేవయే పరమావధిగా ఎంచి పనిజేయగలమన్నారు. టోండే గారు ప్రారంభోత్సవ చిహ్నంగా కొంత ధనాన్ని బ్యాంకులో డిపాజిట్టు జేశారు. అతిథులకు తేనేటి విందు జరిగింది.

– విమర్శకుడు

సినిమా వార్తలు

పొన్నలూరి వారి శోభ

వాహినీ పేరుతో బివిఎన్‌రెడ్డి గారి దర్శకత్వం క్రింద భాగ్యరేఖ చిత్రాన్ని నిర్మిస్తున్న పొన్నలూరు సోదరులు, తమ రెండవ చిత్రాన్ని గూడా సెట్సుకు తీసుక పోతున్నారు. దీని పేరు శోభ. ఈ సాంఘిక చిత్రానికి సంభాషణలు డి.వి.నరసరాజు గారు రాశారు. సంగీత దర్శకత్వం ఏ.యం.రాజా నిర్వహిస్తారట. పొన్నలూరి వారి ఈ ప్రయత్నం శోభించుగాక.

– మల్లార్

బ్రాహ్మణ వివాహ సంబంధాలకు
సంప్రదించండి
ఫోన్: 0861-6527494
e-mail: svsmarriagelinks@yahoo.com


కుల చిచ్చు

4వ పేజీ కొరవ

86 మంది కార్మికులు గత 15 ఏళ్లుగా పనిచేస్తున్నారు. వీరంతా యూనియన్ పెట్టుకొని లేబర్ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ కూడా చేయించుకొన్నారు. వాస్తవానికి డిపోలో 50మంది మాత్రమే పనిచేయాలి. ఇప్పుడున్న 86 మందికే కూలీ గిట్టక ఇబ్బందులు పడుతుంటే, అదనంగా మరో 50 మంది కార్మికులను ఎమ్మెల్యే సలహా మీదట నెల్లూరు ఆర్డీఓ వెంకట రమణారెడ్డి పోలీసుల సహకారంతో తీసుకొచ్చి పెట్టారు. ఈ వ్యవహారమై సివిటియు, ఎమ్మెల్యే మధ్య లడాయి నడుస్తుంది. ఉన్నతాధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకొని తక్షణం పరిష్కారం కనుగొకపోతే ఐఎంఎల్ డిపో దగ్గర గందరగోళాలు చోటు చేసుకొనే ప్రమాదముంది.

బస్సు డ్రైవర్లకు తన్నులు, గుంజిళ్లు!

నెల్లూరు నగరంలో సిటీ బస్సుల వేగానికి కళ్లెం వేయాలని పోలీసులు గతంలో ఎంతగా ప్రయత్నించినా మెరుగైన ఫలితాలు రాలేదు. బస్సు డ్రైవర్లపై కేసులు పెట్టినా, పెనాల్టీ వేసినా కట్టేసి వెళ్తున్నారే తప్ప వీరి దుందుడుకు ధోరణి మారడం లేదు. దీంతో ఎస్పీ లక్ష్మీరెడ్డి 27తేది మఫ్టీలో నగరమంతా తిరిగారు. ఏ ప్రాంతంలో ట్రాఫిక్ నిలబడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనికి గల కారణాలు అన్వేషించారు. ఈ సమయంలోనే ఆసక్తికర సన్నివేశాలు చోటు చేసుకున్నాయి. అయ్యప్ప గుడి సెంటర్ వద్ద ఎస్పీ ట్రాఫిక్ పరిశీలన సమయంలో ఓ సిటీ బస్సు డ్రైవర్ నడి రోడ్డులో బస్సును నిలపడం మూలంగా వెనుక ట్రాఫిక్ నిలిచి పోయింది. ఇది



నెల్లూరు మూలపేటలోని రామయ్య బడిలో చదివి టెన్త్‌లో 451 మార్కులు తెచ్చుకొన్న సంధ్యారాణికి విలువైన పుస్తకాలు బహుకరిస్తున్న కానిస్టేబుల్ వై.సతీష్‌కుమార్

గమనించిన ఎస్పీ నేరుగా నడుచుకొంటూ బస్సు డ్రైవర్ వద్దకు వెళ్లారు. డ్రైవర్ సిగరెట్ కూడా తాగుతూ తన సీటు దగ్గర నిలబడిన ఎస్పీని పట్టించుకోలేదు. ఎస్పీ అతన్ని క్రిందికి దించి బస్సు ఎక్కడ ఆపాలని ప్రశ్నించి, ఎన్ని కేసులున్నాయో ఆరా తీశారు. నాలుగు కేసులు నమోదైతే లైసెన్సు రద్దవుతుందని తెలియదా అని ప్రశ్నించి, మరోసారి ఈ పని చేయకూడదని ఈ డ్రైవర్ చేత రోడ్డుపై పది గుంజిళ్లు తీయించారు. ఈ సమయంలోనే అతివేగంతో వెళ్తుండిన మరో ఆటో డ్రైవర్, ఎస్పీ కంట పడ్డాడు. అతన్ని కూడా ఆపిన ఎస్పీ, కేసు రాసి పెనాల్టీ వేస్తే రోజు బాడుగ కట్టను సైతం డబ్బులుండవు. నీ భార్యా పిల్లలు పస్తులుండాలి. నీవు మారాలి; అందుకే 20 గుంజిళ్లు తీయమని రోడ్డుపై నిలబెట్టి తీయించారు. వేదాయపాళెం సెంటర్‌లో ఓ సిటీ బస్సు డ్రైవర్ ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గించడంతో ఎస్పీ అతని చెంప చెళ్లు మనిపించారు. గుంజిళ్లు, చెంపదెబ్బులు తలచుకొని సిటీ బస్సులు, ఆటో డ్రైవర్లు కాస్త ఆలోచనలో పడ్డారు. ఈ నాటి పద్ధతుల మూలంగానైనా ట్రాఫిక్ గాడిలో పడితే అంతే చాలు.

స్వర్ణభారత్ ఉచిత సేవలు

వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టులో ఉచిత గుండె వ్యాధుల నిర్ధారణ శిబిరం 25తేది జరిగింది. శిబిరాన్ని బిజెపి జాతీయ నేత వెంకయ్యనాయుడు ప్రారంభించి మాట్లాడారు. రకరకాల పని ఒత్తిళ్ల వల్ల అన్నిరకాల ప్రజలు గుండె జబ్బులకు చేరువవుతున్నారని, వైద్యం ఖరీదు కావడంతో మృత్యువుకు తలవంచుతున్నట్లు చెప్పారు. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను పేద ప్రజలకు క్రమం తప్పకుండా అందిస్తున్న స్వర్ణభారత్ ట్రస్టును అభినందించారు. డాక్టర్ బొల్లినేని భాస్కరరావు మాట్లాడుతూ తెల్లకార్డు కల్గి వుండే కుటుంబాలకు ప్రభుత్వం వంద రూపాయలకే ఇన్సూరెన్స్ చేసే పథకాన్ని వచ్చే సంక్రాంతికి ప్రారంభిస్తుందని, ప్రజలంతా దీన్ని వినియోగించుకోవాలన్నారు. విజయా హార్ట్ ఫౌండేషన్‌లో డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ తాను వెంకటాచలంలోనే పుట్టానని, ఇక్కడి ప్రజలకు వైద్యపరమైన సేవలకు సహకారం అందిస్తానన్నారు. డాక్టర్లు భాస్కరరావు, విజయకుమార్, రాజశేఖర్ కలిసి 236 మంది రోగులను పరీక్షించారు. 25 మందికి ఎక్స్‌రే, 76 మందికి ఇసిజి, 39 మందికి ఎకో, ఇద్దరికి ట్రెడ్‌మిల్ టెస్ట్, 21 మందికి రక్త పరీక్షలు చేశారు. 6మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఈ సందర్భంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఇంజినీరింగ్ విద్యార్థి సి.వెంకటరాజేష్‌కు ముప్పవరపు ఫౌండేషన్ నుంచి 10వేల రూపాయలను స్వర్ణభారత్ ట్రస్టీ ఐ.దీపావెంకట్ అందించారు.

తరుణ్

9వ పేజీ కొరవ

మాల ప్రతిష్ట అంతర్జాతీయ స్థాయిలో అపహాస్యం పాలవుతుందంటుందీ ముద్దుగుమ్మ. కాని ఈమె మాటలు చిత్ర పరిశ్రమలో ఎవరి తలకెక్కుతాయి?

అర్థం కాని పార్వతి

తెలుగులో రెండు మూడు చిత్రాల్లో హీరోయిన్‌గా నటిస్తున్న పార్వతి మెల్టన్ అమెరికా నుంచి ఆంధ్రాకు దిగుమతి అయ్యింది. అందరితో కలుపుగోలుగా వుండే ఈ హీరోయిన్‌తో స్నేహానికి యువ హీరోలు వెంపర్లాడుతున్నారు. హీరోలను దీన్నుంచి పిలిచి ఫైన్ ఆఫర్ చేస్తున్న హీరోయిన్ ఇంగ్లీషు మాటతీరు మన హీరోలకు అర్థంగాక తెగ ఫీలై పోతున్నారు. అల్లరి ఫేం నరేష్ ఒక్కడే ఈమె ముందు నెగ్గుకొచ్చాడని ఫిల్మ్‌నగర్ కథనం.

వలవిసిరా!

9వ పేజీ కొరవ

సిన్సియర్, నిజాయితీపరుడు. మానసికంగా గొప్పవాడు. అతనితో వున్నప్పుడు ఎంతో ప్రేరణని పొందుతానంటుంది. ఈ మాటలన్నీ చెబుతూ కునాల్‌ను గుప్పెట బిగించలేదంటే నమ్మేదెవరు?

కొగిలి చేరాడు!

9వ పేజీ కొరవ

ఎస్టేట్ వ్యాపారి హర్ష్‌తో ప్రానీతో కలిసి జల్సాగా తిరుగుతుంది. హర్ష్ కుటుంబీకులు ముంబాయి వాసులే. పడితే మంచి ప్రియుడ్ని పట్టాలన్న వుద్దేశ్యంతో న్యూయార్క్ రియల్ ఎస్టేట్ వ్యాపారిని సమీరా పట్టిందని బాలీవుడ్ కోడై కూస్తుంది.

ఎలాగబ్బా?

9వ పేజీ కొరవ

కలిసి పిన్ని ఏవేవో చేస్తుందంటే తల ఎక్కడ పెట్టుకోవాలంటుంది అమృతా అరోరా. బావను మినహాయించి మిగతా వారితో ఎలాగైనా నటిస్తానంటుంది.

అందగత్తె


9వ పేజీ కొరవ

దక తప్పడం లేదు. ఈ విషయమై ఆమె మాట్లాడుతూ నాలోని ఈ మర్చిపోయే గుణాన్ని చూసి నా ఫ్రెండ్స్, సన్నిహితులు ఎగతాళి చేస్తున్నారు. అందుకే జ్ఞాపకశక్తిని మెరుగు పర్చుకోవాలనుకొంటున్నా. భవిష్యత్తులో అన్ని విషయాలు గుర్తుంచుకొనే స్థాయికి ఎదుగుతానంటుంది ఈ ముద్దుగుమ్మ.

క్రిమినల్స్ గ్యాంగ్

4వ పేజీ కొరవ

చెప్పారు. ఇంతమంది ముఠా సభ్యులను పట్టుకున్న తర్వాత కూడా 27తేది రాత్రి ఆటోలో బయలుదేరిన ఒక యువతిని దొంతాలి అదవుల్లోకి ఆటోను మళ్లించి అత్యాచారానికి యత్నించారు. యువతి



ప్రపంచ దోబుకాయం స్మృతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని నెల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విజయ లాబొరేటరీ నిర్వాహకుడు డాక్టర్ ఎంపెంచలరెడ్డి.

పెట్టిన కేకలకు చుట్టు ప్రక్కల ప్రాంతాల ప్రజలు రావడంతో పారిపోయారు. గొలగమూడి రూట్‌లో గతంలో ఇటువంటి సంఘటనలు జరిగేవి. ఈ అకృత్యాలు చేస్తుండిన చింతారెడ్డిపాళెంకు చెందిన ముఠాను పట్టుకొని జైలుకు పంపాక ఇవి తగ్గాయి. కొత్తూరు, రామకోటయ్య నగర్‌లపై పోలీసులు దృష్టి పెడితే ఈ ఆగంతక ముఠాను పట్టుకోవడం పెద్ద పనికాదు.

రాజకీయ గాలి

9వ పేజీ కొరవ

మని పుత్తుత్తి కబుర్లు చెబుతున్నారే గాని ఈ వ్యవహారాన్ని అమలు చేయను ఎవరికీ ఇష్టం లేదు. వేదికలెక్కి మాత్రం, మహిళా హక్కుల గూర్చి మాట్లాడుతారు. దీనివల్ల లాభం లేదు. పాలకుల మనసులు అంత సులభంగా మారవు. అందువల్లే మహిళా మణులంతా వీధుల్లోకి వచ్చి పోరాటం చేయాలి. ఇటువంటి పోరాటాల్లో తాను ముందుంటానంటుంది. ఇదే ఆవేశం కడదాకా వుంటే కేరళ రాజకీయాల్లో గోపిక ప్రవేశించినా ఆశ్చర్య పోనక్కరలేదు.

చిత్రసమీక్ష

9వ పేజీ కొరవ

(జీవన్) ఐదవ తరగతిలో మంచి విద్యార్థి. ఇతని తండ్రి తహసీల్దార్. చిన్న పిల్లాడని చూడకుండా అక్రమ వ్యాపారుల వద్ద లంచాలు తీసుకోరమ్మని పంపుతుంటాడు. ఒక్కసారి నోట్ల కట్టలను చూసి అందులో కొన్ని కొట్టేసి మాణిక్యం జల్సా చేస్తాడు. అప్పటి నుంచి పూర్తిగా అదుపు తప్పిపోయి 420గా తయారవుతాడు. చెన్నైలో ఎస్ఐగా పనిచేసే మామయ్యకు, మాణిక్యం ఎందుకలా తయారయ్యాడో తెలుసు. తన వద్దకు వస్తే మారుతాడని పిలిపించి ఇంట్లోనే వుండనిస్తాడు. మాణిక్యం వుండే అపార్ట్‌మెంట్ ప్రక్కన గోల్ఫ్ కోర్సు వుంటుంది. ఇక్కడకు ఆట సేర్చుకోను వచ్చే ధనవంతురాలు రూపిణి (మాళవిక), భర్త, పిల్లలుండగానే, కుటుంబ స్నేహితుడు, గోల్ఫ్ సేర్చే రమేష్ (అబ్బాస్)తో అక్రమ సంబంధం పెట్టుకొంటుంది. ఈ వ్యవహారాన్ని మాణిక్యం రహస్యంగా వీడియో చిత్రీకరించి రూపిణిని బ్లాక్‌మెయిల్ చేయనారంభిస్తాడు. అమె వద్ద పెద్ద మొత్తంలో డబ్బు తీసుకొంటాడు. తన మిత్రులతో సహా ఆస్ట్రేలియా వెళ్లిన మాణిక్యంకు శరణ్య (సోని అగర్వాల్) తారస పడుతుంది. ఆమెను ప్రేమిస్తాడు. కానీ శరణ్య, రూపిణి తనపై ప్రయోగించిన అస్త్రమని తెలుసుకొంటాడు. ఇండియా తిరిగి వచ్చిన మాణిక్యంను సీతిగా బతకమని శరణ్య కోరుతుంది. ఆమె ప్రేమ కోసం రూపిణిని బ్లాక్‌మెయిల్ చేయడం మానుతాడు. నానా కష్టాలు పడి వుద్యోగం సంపాదిస్తాడు. ఈ దశలో రూపిణి భర్తకు ఆమెపై అనుమానం వచ్చి అసలు విషయం తెలుసుకోమని డిటెక్టివ్‌ను నియమిస్తాడు. నిప్పులాంటి నిజాలన్నీ బయట పడడంతో మిత్రుడు రమేష్‌తో పాటు, మాణిక్యంను అంతమొందిస్తాడు. సంపాదనే లక్ష్యంగా భార్యను నిర్లక్ష్యం చేయకూడదని మాళవికను చివరకు ఆమె భర్త హత్తుకుంటాడు. విదేశాలకు వెళ్లిపోవాలని పథకం రచించుకొన్న శరణ్య, మాణిక్యం కోసం విమానాశ్రయంలో వేచి చూస్తుండగా చిత్రం ముగుస్తుంది. జీవన్, సోనిఅగర్వాల్, మాళవిక, అబ్బాస్ తమ పాత్రలు అలవోకగా పోషించారు. టైమ్‌పాస్ కోసం మాణిక్యం చిత్రాన్ని చూడొచ్చు.

ఉత్తరక్రియలు



నెల్లూరు జిల్లాలో పేద, ధనికులనే భేదం లేకుండా ధుస్సాధ్యమైన వ్యాధులను సైతం నయం చేసి ప్రజాదాక్తరుగా నిస్వార్థ సేవలందించిన మానవతామూర్తి, భగవాన్ శ్రీ సత్యసాయి బాబా గారి ఆరాధనలో సామాన్యులలో సైతం భక్తి ప్రపత్తులు పెంపొందించి శ్రీ బాబాగారి ఆశీర్వాదం, ప్రశంసలు అందుకొన్న ధన్యజీవి, మా శ్రేయస్సుకు కృషి చేసి, మా ఉన్నతిని కాంక్షించిన పూజ్యనీయులు

డాక్టర్ శ్రీ మన్నెం వెంకట కృష్ణారెడ్డి గారు

తే28-11-2006వ మంగళవారం ఉదయం 10 గంటలకు దైవ సన్నిధికి చేరినారు.
వారి ఉత్తరక్రియలు తే6-12-2006వ బుధవారం నాడు పుట్టపర్తిలో జరుగును.
కావున తెలియజేయదగినది.

భార్య: మన్నెం సుబ్బరాయమ్మ

సోదరుడు: మన్నెం దన్వంతిరెడ్డి - సరస్వతిమ్మ (మరదలు)

డా॥ మన్నెం వెంకటకృష్ణారెడ్డి గారు MBBS.,
Ex.MLC, Ex.IMA State President

కుమారులు	-	కోడళ్ళు	మనమళ్ళు	మనమరాళ్ళు
మన్నెం శేషాద్రిరెడ్డి	-	విద్య		Dr. సాయిప్రసన్న - అనంద్ Er.
				మన్నెం సుమన
మన్నెం వినోద్	-	పద్మలత	మన్నెం విజయసాయి	...
కుమార్తెలు	-	అల్లుళ్ళు		
కొండా అనురాధ	-	కొండా బలరామిరెడ్డి	కొండా నిరంజన్‌రెడ్డి - మోహిని	భీమిరెడ్డి నీరజ - శాంతికుమార్‌రెడ్డి
అవిలాల ఉషారాణి	-	డా॥ అవిలాల శేషాద్రిరెడ్డి		సిద్ధంరెడ్డి ఫల్గుణ - వేణుగోపాల్
అవిలాల లక్ష్మి	-	...	అవిలాల చిత్తరంజన్ - పూజ,	చిల్లకూరు స్వాతి - శ్రీనివాస్

మున్ మనుమలు, మున్ మనుమరాండ్రు



మేనకూరులో టెక్స్‌టైల్ పార్కు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి. మాజీ ముఖ్యమంత్రి జనార్దనరెడ్డి, చదువుల మంత్రి రాజ్యలక్ష్మమ్మ, ఎమ్మెల్యేలు రామనారాయణరెడ్డి, నెలవల సుబ్రహ్మణ్యం, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ప్రక్కన వున్నారు.

బలిపశువు రేచల్ ఛటర్జీ

కరీంనగర్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఉడకొడిస్తున్న కరెంటు సమస్యకు ట్రాన్స్‌కో నిర్వాహకురాలు రేచల్ ఛటర్జీ కారకురాలని ముఖ్యమంత్రికి నచ్చ చెప్పడానికి విద్యుత్ మంత్రి షబ్బీర్ ఆలి శత విధాల ప్రయత్నిస్తున్నారు. ఉచిత విద్యుత్ పథకం అమలు విజయవంతం కావడానికి రేచల్ సమర్థతే కారణమనే నమ్మకంతో ఆమెకు ఎక్కడలేని ప్రాధాన్యత ఇస్తున్నాడు ముఖ్యమంత్రి. ట్రాన్స్‌కో వ్యవహారాలలో ఆమెకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. డైరెక్టర్ల నియామకం కూడా ఆమె సిఫార్సుల ప్రకారమే జరిపాడు. తాను పేరుకే విద్యుత్ మంత్రిగా వున్నాడు తప్ప తనకు బంట్రోతు పాటి విలువ కూడా లేదని వాపోతుంటాడు షబ్బీర్ ఆలి. అయితే రేచల్ గురించి ఏమి చెప్పినా ముఖ్యమంత్రి విన్పించుకునే పరిస్థితి లేదు కాబట్టి, ఆ ఆవేదనలో లోపలే దాచుకొంటూ వచ్చాడు.

కరీంనగర్ ప్రచారంలో తన కసి తీర్చుకునే మార్గం కన్పించింది ఆయనకు. ఉచిత విద్యుత్ పట్ల రైతాంగంలో పెద్దగా మోజు లేదని; సరఫరా సక్రమంగా చేయాలని మాత్రమే వారు కోరుకొంటున్నారని; రైతులకు ఏడు గంటల విద్యుత్ ఇస్తున్నామని; వ్యవసాయ వాడకం వల్లనే సరఫరా మీద ఒత్తిడి పెరుగుతుందని రేచల్ చెప్పే

కొరవ 7వ పేజీలో

గౌరవనీయ పట్టభద్రులకు విజ్ఞప్తి



కృతజ్ఞతలు : చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి శాసన మండలికి ఓటరుగా నమోదు చేయించుకొన్న గౌరవ పట్టభద్రులకు పేరు పేరునా కృతజ్ఞతలు.

ఓటర్ల జాబితా: ముసాయిదా ఓటర్ల జాబితాను తేది: 22.11.2006న ప్రచురించి ప్రజల పరిశీలన కొరకు సంబంధిత కార్యాలయములలో ఉంచివున్నారు.
అలాగే www.ceoandhra.nic.in వెబ్‌సైట్‌లో ముసాయిదా ఓటర్ల జాబితాను చూడవచ్చు.

ముసాయిదా ఓటర్ల జాబితా పరిశీలన ఆవశ్యకత : గౌరవనీయ పట్టభద్రులు ప్రచురింపబడియున్న ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించి తమ పేరు ఓటర్ల జాబితాలో ఉన్నదో, లేదో, పేరు ఇతర వివరములు సరిగా ఉన్నవో, లేదో సరిచూచుకొన్నదో, సవరణలకు (ఫారం నెం.8), అభ్యంతరములకు (ఫారం నెం.7), నివాస మార్పుకు (ఫారం నెం.8ఎ) అవకాశం కలదు.

తిరస్కరణ - అప్పీలు : ఇంతకు ముందు మీరు ఫారం నెం.18ను సమర్పించి వున్నప్పటికినీ మీ పేరు ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చని యెడల సంబంధిత అధికారి ఎందుకు మీ దరఖాస్తును తిరస్కరించినారో కారణం తెలియచేయవలసి వున్నది. తిరస్కారమునకు కారణం సరి అయినది కాదు అని మీరు భావించిన యెడల ఎందులకు తిరస్కరణ సబబు కాదో విపరిస్తూ చీఫ్ ఎలక్టోరల్ అధికారి వద్ద అప్పీలు చేసుకొనవచ్చును.

ఓటరుగా నమోదుకు మరో అవకాశం : అనివార్య కారణముల వలన ఓటరుగా నమోదు చేసుకోలేకపోయిన గౌరవ పట్టభద్రులు ఫారం నెం.18తో పాటు, ముందు నిర్ణయించిన సమయం లోపల ఏ కారణముల చేత ఓటరుగా నమోదు చేసుకోలేక పోయినారో కారణం తెలియజేస్తూ దరఖాస్తును (డిక్లరేషన్) సమర్పించుట ద్వారా ఓటరుగా నమోదు చేయించుకొనవచ్చును.

ఆఖరి తేది : పై తెలియజేసిన అవకాశములను వినియోగించుకొనుటకు గౌరవ పట్టభద్రులకు డిసెంబరు 7వ తేది వరకు అవకాశము ఉన్నది.

అభ్యర్థి గురించి : శ్రీ దేశాయిశెట్టి హనుమంతరావు గత 25 సంవత్సరములుగా నెల్లూరు నగరంలో న్యాయవాద వృత్తి నిర్వహిస్తూ, అనేక ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర సంస్థలకు న్యాయ సలహాదారుగా వున్నారు. ప్రభుత్వ న్యాయవాదిగా పని చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులుగా వున్నారు. వృత్తిపరంగా అన్ని సామాజిక వర్గాలతో మానవీయత సంబంధాలు కలిగియున్నారు. అనేక సమాజహిత కార్యక్రమములలో తన వంతు కృషి చేస్తున్నారు. అనేక ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నారు. శ్రీ హనుమంతరావు సౌమ్యుడు, వివాదరహితుడు, మానవతా వాది, ఎల్లవేళలా అందరికీ అందుబాటులో వుండే వ్యక్తి.

రానున్న శాసనమండలి ఎన్నికలలో శ్రీ దేశాయిశెట్టి హనుమంతరావు చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ, అనేక ప్రజా సంఘాలు మరియు స్వచ్ఛంద సేవా సంస్థలు బలపరచిన అభ్యర్థిగా పోటీ చేయుచున్నారు. కావున మీ సంపూర్ణ సహాయ సహకారాలు అందించ ప్రార్థన. ధన్యవాదములతో...

దేశాయిశెట్టి హనుమంతరావు గారి మిత్రులు మరియు శ్రేయోభిలాషులు

చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు

శ్రద్ధాంజలి



దేవుడిచ్చిన వరం మీరు
ప్రజా సేవలో ధన్యం మీ జీవితం
ప్రతి ఒక్కరికి ఆదర్శం మీ మార్గం

కీ॥శే॥ శ్రీ మాగుంట సుబ్బరామరెడ్డి గారి

(ఒంగోలు పార్లమెంటు మాజీ సభ్యులు)

పదకొండవ వర్థంతి సందర్భంగా

వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ...

మాగుంట కుటుంబ సభ్యులు
మరియు అభిమానులు

కీ॥శే॥ శ్రీ మాగుంట సుబ్బరామరెడ్డి గారు

ఒంగోలు పార్లమెంటు మాజీ సభ్యులు

జననం: 26-11-1947 మరణం: 01-12-1995

తేది 1-12-2006, శుక్రవారం ఉదయం 11గంటల నుండి నెల్లూరు, రంగనాయకులపేటలోని శ్రీ రాఘవ కళ్యాణ మండపం నందు అన్నదాన కార్యక్రమం జరుగును.

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.